


## ఇష్టారాజ్యంగా వైద్య పరీక్షలు చేయొద్దు

» డాక్టర్ బి.కళావతిబాయి, డీఎంహెచ్‌వో, ఖమ్మం

ఫటాఫట్



ప్రశ్న: ప్రైవేటు ఆస్పత్రుల్లో పరీక్షల పేరుతో రోగుల వద్ద డబ్బులు దండుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి?

జవాబు: ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు రోగులకు అవసరం ఉంటేనే పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కడుపు నొప్పి కోసం వస్తే బాడీ అంతా చెకప్ చేయాలనడం సరైంది కాదు. ఇలాంటి వారి పై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం.

ప్ర: ప్రైవేటు ఆస్పత్రులు మల్టీ స్పెషాలిటీ పేరుతో వైద్యుల కన్సల్టెన్సీలా నిర్వహిస్తున్నారు కదా ?

జ: మల్టీ స్పెషాలిటీ వైద్యశాల అంటే ఖచ్చితంగా ఆ వైద్యులు అక్కడ పనిచేయాల్సి ఉంటుంది. ఎక్కడో ఉండి అవసరానికి వచ్చి సేవలు అందిస్తామంటే కుదరదు. బోర్డులో ఆ వైద్యుని పేరు పెట్టుకుంటే ఖచ్చితంగా ఆ వైద్యుడు అందుబాటులో ఉండాల్సిందే. అలా అందుబాటులో ఉంటేనే ఆ పేరు పెట్టాలి.

ప్ర: జిల్లాలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలపైనా పలు ఆరోపణలు వస్తున్నాయి. దీనికి మీరు తీసుకుంటున్న చర్యలు ?

జ: ఆర్‌ఎంపీలు వైద్య నిబంధనల ప్రకారమే నడుచుకోవాలి. ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలి. ఇంజక్షన్లు చేయకూడదు. ఎక్కడైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

ప్ర: ఇటీవలె మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో తనిఖీల్లో కొన్ని ఆస్పత్రులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి కదా.. వారిపై తీసుకుంటున్న చర్యలు ..?

జ: మెడికల్ కౌన్సిల్ సభ్యుల తనిఖీల్లో కొందరు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా వైద్యాన్ని చేస్తున్నారని తేలినట్లు తెలిసింది. దీనిపై పోలీస్ కేసులు నమోదయినట్లు మా దృష్టికి వచ్చింది. వీటిపై శాఖాపరమైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోనున్నాం.

ప్ర: జిల్లాలో వైద్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు ?

జ: అన్ని లక్ష్యాల్లోనూ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా కృషిచేస్తున్నాం. అన్ని పీహెచ్‌సీల్లో ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని సూచించాం. మందుల స్టాకు బోర్డులు ప్రజలకు తెలిసేలా ప్రదర్శనకు ఉంచుతున్నాం.

ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్

## రేపు నగరంలో జాబ్ మేళా




ఖమ్మం కలెక్టరేట్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఈనెల 28న జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి ఎస్.మాధవి తెలిపారు. ఖమ్మంలోని సర్వగ్రాం ఫైనాన్స్ కంపెనీలో బ్రాంచ్ రిలేషన్షిప్ అధికారి 20 పోస్టులకు, సికింద్రాబాద్ లోని కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ ప్రైవేట్ కంపెనీలో హాస్పిటల్ బిల్లింగ్ 25 పోస్టులకు, జీడీఏ నర్సింగ్ అసిస్టెంట్ 10 పోస్టుల్లో ఉద్యోగాలు కల్పించుటకు గురువారం ఉదయం 10.00 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ., టేకులపల్లి)లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ. 22 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. 18 నుంచి 29 వయస్సు గల, ఆసక్తి, అర్హత గల జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు విద్యార్హతల సర్టిఫికెట్ ప్రతులతో జాబ్ మేళాకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 82472 55859 నందు సంప్రదించాలని కోరారు.

# 'ధరణి' దరఖాస్తులకు.. దిక్కేది?!




ధరణి సమస్యల పరిష్కారం నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ప్రతివారం భూసమస్యల పరిష్కారం కోసం ఎంతో మంది రైతులు రెవెన్యూ కార్యాలయాలకు, జిల్లా కేంద్రంలో కలెక్టర్ నిర్వహించే ప్రజావాణికి తిరుగుతూనే ఉన్నారు. అయినా వారి సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ధరణిపై సమీక్షించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాలో అన్ని మండలాల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివరిలో కలెక్టర్ సారథ్యంలో 21 మండలాల్లోనూ 60 నుంచి 70 బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై మార్చి 1 నుంచి 9 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

» పరిష్కారానికి నోచుకోని భూ సంబంధిత సమస్యలు
» పెండింగ్‌లో నెలలుగా మూలుగుతున్న దరఖాస్తులు
» తహసీల్దార్ల స్థాయిలో 1,116... సీసీఎల్‌ఏలో 210
» ప్రజావాణి చుట్టూ తిరుగుతున్న బాధితులు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధరణి సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆర్డీవో, తహసీల్దార్లకు ప్రత్యేక అధికారాలు ఇచ్చారు. దీంతో మండల స్థాయిలో తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు పారాలీగల్ వలంటీర్లు, కమ్యునిటీ సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు సభ్యులుగా చేర్చి ఒక్కో మండలంలో కనీసం రెండు నుంచి మూడు కమిటీలను వేశారు. వీరంతా మీ-సేవలు, తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. జిల్లాలో ప్రత్యేక బృందాలు పరిశీలించి ఏ రోజుకు ఆరోజు నివేదికలు అందించారు. కానీ నేటికీ కొన్ని సమస్యలు ఇంకా పరిష్కారానికే నోచుకోలేదు. దీంతో బాధిత రైతులు మాత్రం కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

### మాడ్యుల్స్ వారీగా...

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ధరణి దరఖాస్తులు చాలా పెండింగ్‌లో ఉన్నాయి. కలెక్టర్‌గా ముజమ్మిల్‌ఖాన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాలో నూటికి నూరు శాతం పరిష్కరించాలని భావించి ఆ దిశగా కసరత్తు చేస్తున్నా ఇంకా పెండింగ్ మిగిలిపోతూనే ఉన్నాయి. ఇప్పటికీ డేటా కరెక్షన్ చేయాల్సినవి 370, అర్బన్ ల్యాండ్స్ 2, మ్యూటేషన్లు 104, పీవోబీ దరఖాస్తులు 202 పెండింగ్‌లో ఉన్నాయి. ఆధార్ సీడింగ్స్, గ్రీవెన్స్ లాండ్ మ్యాటర్స్ సమస్యలను పరిష్కరించినా ఇంకా కొత్తవి వస్తున్నాయి. టీఎం మాడ్యుల్స్ ఆధారంగా జిల్లాలో ప్రత్యేక డ్రైవ్‌కు ముందు 10,265 ధరణి దరఖాస్తులు పెండింగ్ ఉన్నట్లు అధికారులు లెక్క తేల్చారు.

మార్చిలో నిర్వహించిన బృందాల క్షేత్రస్థాయి పరిశీలన, రికార్డ్స్ నమోదు పరిశీలన తర్వాత నివేదికల ఆధారంగా 3వేలకు పైగా దరఖాస్తులు పరిష్కరించారు. అయితే ఇంకా చింతకాని మండలంలో 166, ఖమ్మం అర్బన్‌లో 151, ఖమ్మం రూరల్ మండలంలో 108, నేలకొండపల్లి మండలంలో 122 దరఖాస్తులు తహసీల్దార్ లాగిన్‌లోనే పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,116 దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉండగా, సీసీఎల్‌ఏలో 210 దరఖాస్తులు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 1,948 దరఖాస్తులు నేటికీ పెండింగ్‌లో ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో అధికారులు, తహసీల్దార్లు ప్రత్యేకంగా దృష్టి సారిస్తే తప్ప ఆయా దరఖాస్తులు పరిష్కారమయ్యే అవకాశం లేదు.

### పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు

డేటా కరెక్షన్ దరఖాస్తులు 370, అర్బన్ ల్యాండ్ 02, మ్యుటేషన్లు 104, కోర్టు కేసులు 34, పీవోబీ 202 దరఖాస్తులు కలిపి మొత్తం 612 పెండింగ్‌లో ఉన్నాయి. ధరణి పెండింగ్ దరఖాస్తులు మండలాలలో తహసీల్దార్ స్థాయిలో 1,116,సీసీఎల్‌ఏలో 210, కలెక్టర్ లాగిన్‌లో 93, అదనపు కలెక్టర్ లాగిన్‌లో 529, మొత్తం 1,948 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.



భూ సమస్యపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న అధికారులు

## ఒక పంచాయతీ.. ఒక మండలం...

» మళ్లీ మండల పరిషత్‌గా ఆవిర్భవించిన భద్రాచలం
» నాలుగేళ్ల తరువాత పునరుద్ధరణ
» జీవో జారీ చేసిన పంచాయతీరాజ్ శాఖ




భద్రాచలం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భద్రాచలం మళ్లీ మండలపరిషత్‌గా కొనసాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లో 32 మండలపరిషత్‌లను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డీఎస్ లోకేష్‌కుమార్ జీవో-67 జారీ చేశారు. ఇందులో భద్రాచలం మండలాన్ని పునరుద్ధరించారు. దీంతో భద్రాచలం పంచాయతీ ఇకపై భద్రాచలం మండల పరిషత్‌గా కూడా కొనసాగనుంది. 2020 జూలై 2న భద్రాచలం మండలపరిషత్ పాలకవర్గ పదవీకాలం పూర్తికావడంతో మండలపరిషత్‌ను ఆళ్లపల్లికి తరలిస్తూ ఇక్కడ పనిచేసే ఎనిమిది మందిని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. మళ్లీ నాలుగేళ్ల తరువాత భద్రాచల మండలపరిషత్‌ను పునరుద్ధరిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

### నాడు అతిపెద్ద మండలం..

భద్రాచలం మండలం ఒకప్పుడు 25 పంచాయతీలతో జిల్లాలో అతిపెద్ద మండలంగా ఉండేది. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం చోటు చేసుకున్న ప్రత్యేక పరిస్థితుల్లో పోలవరం ముంపు మండలాల పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఏపీ పరిధిలో విలీనం చేశారు. అందులో భద్రాచలం మండలం కూడా ఉంది. భద్రాచలం పంచాయతీ మినహా మండలంలోని అన్ని పంచాయతీలను ఏపీలో (మిగతా 6వ పేజీలో)



రామాలయంలో
## ఆర్థిక క్రమశిక్షణ

» ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి తీసుకున్న డబ్బులో రూ.5కోట్లు తిరిగి జమ 6
» చెల్లింపులన్నీ సకాలంలోనే...
» ఈవో నిర్ణయాలతో ఫలితాలు



పోలీస్ కార్ఖాన
## పకడ్బందీ శిక్షణ

» ఖమ్మం పీటీసీలో కానిస్టేబుళ్లకు ప్రొఫెషనల్ ట్రైనింగ్
» ఇప్పటికి 8బ్యాచ్‌లలో 1692మందికి తర్ఫీదు 6



# పైన కోటింగ్.. లోన చీటింగ్..



» బంగారు కడియాల బాగోతంలో క్రమంగా వెల్లడవుతున్న నిజాలు
» ఐదు పొరల వరకు బంగారం పూత... లోపల మొత్తం వెండి
» డీసీసీబీ పరిధిలో మూడు బ్రాంచీల్లో రూ.30 లక్షల రుణాలు పొందినట్టు నిర్ధారణ
» 26 అకౌంట్ల పేరిట రుణాలు.. పరారీలో రుణగ్రస్థులు
» మోసాన్ని గుర్తించని బ్యాంకుల అప్రయిజర్లు
» డబ్బులు చెల్లించపోతే కేసులు పెడతామని బ్యాంకు అధికారుల ఒత్తిడి
» ఇప్పటివరకు రూ.5లక్షలు రికవరీ?

ఖమ్మం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బంగారు తాకట్టు రుణాలు బ్యాంకులకు పరీక్ష కాబోతున్నాయి. నకిలీ బంగారు కడియాలు తాకట్టు పెట్టి రుణాలు పొంది బ్యాంకులనే బురిడీ కొట్టించిన వైనం విస్తుగొలుపుతోంది. జిల్లా సహకార బ్యాంకు బ్రాంచీలతోపాటు ఇతర వాణిజ్య, ప్రైవేటు బ్యాంకుల్లో నకిలీ బంగారు కడియాలు తాకట్టు పెట్టి, రుణాలు పొందిన వారి నుంచి డబ్బుల రికవరీకి బ్యాంకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రికవరీకి సహకరించకడితే సరి, లేకుంటే కేసులుపెట్టి అరెస్టు చేయిస్తామని బ్యాంకు అధికారులు హెచ్చరికలు జారీచేస్తున్నారు. ఇప్పటికే కొందరు ఖాతాదారులు పరారీలో ఉండగా మరికొందరు ఖాతాదారులు రుణాలు చెల్లిస్తామని, కేసులు పెట్టవద్దని డబ్బులు కట్టేందుకు సానుకూలత వ్యక్తంచేస్తున్నారు. సుమారు రూ.5 లక్షల వరకు కొందరు ఖాతాదారులు చెల్లించినట్టు తెలిసింది. మిగిలిన వారి నుంచి కూడా వసూలు చేసేందుకు ప్రయత్నాలు నడుస్తున్నాయి.

బంగారు కడియాల పేరుతో కొందరు అక్రమార్కులు బ్యాంకులనే బురిడీ కొట్టిస్తున్నారు. అందంగా మెరుపులతో ఉన్న ఈ కడియాలు పైన మెరుపులతో బంగారం ఉంటుండగా లోన వెండి, రాగి వంటి లోహాలతో తయారు చేస్తున్నారు. ఖమ్మం డీసీసీబీ పరిధిలో మూడు బ్రాంచీల్లో సుమారు రూ.30 లక్షల 67 వేలు నకిలీ బంగారు కడియాలతో రుణాలు తీసుకున్నట్టుగా అంతర్గతంగా బ్యాంకు అధికారుల పరిశీలనలో గుర్తించారు. ఇందులో గట్టయ్యసెంటర్, రోటరీనగర్, ఎన్‌ఎస్‌పీ రోడ్డు బ్రాంచీల్లో నకిలీ బంగారు కడియాలు పెట్టి రుణాలు తీసుకున్నట్టు తేలింది.

ఖాతానెంబరు, ఆధార్‌కార్డులతో సహా రుణం తీసుకున్న వారి వివరాలు సేకరించి రుణాల రికవరీకి బ్యాంకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే రూ.5 లక్షల వరకు రికవరీ చేసినట్టు సమాచారం.

వెండి, రాగితో తయారు చేసిన కడియాలకు 5 లేయర్ల వరకు బంగారు పూత ఉంచి లోన వెండితో తయారుచేశారు. ఒక్కో బంగారు కడియం 25.780 గ్రాముల వరకు ఉంది. సుమారు రూ.2 లక్షల వరకు విలువ ఉంటుండగా గత జూన్‌లో ఒక్కో బంగారు కడియం మీద రూ.లక్ష పది నుంచి లక్షా 20 వేల వరకు రుణం పొందారు. మొత్తం 26 అకౌంట్లనుంచి రూ.30.67 లక్షలు రుణాలు తీసుకున్నారు.

రుణాలు తీసుకునే ముందు అప్రైజర్లు టెస్టింగ్‌పరీక్షల్లో పైపూత మాత్రమే పరీక్షలు చేసే వీలుండగా, 22.8 వరకు క్యారెట్ ఉందని 92శాతం బంగారం అని, నిర్ధారణ జరిగింది. దీంతో వారు నకిలీవి కావు అసలని రుణాలకు అనుమతి ఇచ్చారు. అప్రైజర్లు బంగారు ఆభరణాలకు స్కిల్ శాంపిల్స్ మాత్రమే (మిగతా 6వ పేజీలో)

## ప్రభుత్వ వైద్యకళాశాలకు మహర్దశ



రఘునాథపాలెంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

» నూతన భవన సముదాయానికి డిసెంబరు 5న శంకుస్థాపన
» విచ్చేయనున్న రాష్ట్ర మంత్రులు
» ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ 6

## యాసంగి సందడి అప్పుడే షురూ!

» సాగర్ ఎడమకాల్వ పరిధిలో సిద్ధమవుతున్న వరి నారు మడులు
» సాగర్‌లో పుష్కలంగా నీరు ఉండటంతో రైతుల్లో ఉత్సాహం

కల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమకాల్వ ఆయుకట్టు పరిధిలో యాసంగి (రెండో పంట) వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వానాకాలం సీజన్‌లో సాగుచేసిన మొదటి విడత వరి పంట దిగుబడి పూర్తయింది. అధికభాగం ప్రాంతాల్లో రైతుల చేతికి పంట కూడా వచ్చింది. ఈ క్రమంలో యాసంగికి సిద్ధమవుతున్న అన్నదాతలు వరి నారు మడులను సిద్ధం చేశారు. కల్లూరు ప్రాంతంలో సాగర్ ఆయకట్టు కింద 34 వేల ఎకరాల్లో వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు.

వానకాలం సీజన్‌లో ముందస్తుగా వరి సాగు చేయటంతో నవంబరు నెల ప్రారంభం నుంచే వరి కోతలు, నూర్పిళ్లు చేశారు. ఈ క్రమంలో రైతులు యాసంగి సాగుకు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. కల్లూరు మండలంలోని లింగాల, ఎర్రబోయినపల్లి, వాచ్యానాయక్‌తండ, చంద్రుపట్ల, పాయాపూరు, ముచ్చవరం, జిడిబి పల్లి గ్రామాల్లో రైతులు విస్తారంగా వరి నారు మడులు సిద్ధం చేస్తున్నారు. స్వల్ప కాలిక పంట అయిన వరిలో ఎంటియూ-1010, పిఆర్-126, హెచ్‌ఎంటీ రకం వంటి వరి విత్తనాలు చల్లారు.

మండల పరిధిలో ఇంకా పలు గ్రామాల్లో వరి కోతలు పూర్తి కావస్తున్నాయి. అయినప్పటికీ ఆయా ప్రాంతాల రైతులు యాసంగి సాగుకు సమాయత్తమవుతున్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగర్ డ్యామ్‌లో నీరులేక ఆయుకట్టు రైతులు రెండు పంటలను కోల్పోయి తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురవటం, సాగర్ ప్రాజెక్టు డ్యామ్‌లో నీరు ఉన్నందున ఎడమ కాల్వ పరిధిలో రైతులు రెట్టింపు ఉత్సాహంతో యాసంగి వరి సాగుకు ముందుకు వస్తున్నారు. ఈ సీజన్‌లో సాగర్ నీటి విడుదల షెడ్యూల్ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.



కల్లూరులో యాసంగి సాగుకు ఏపుగా పెరిగిన వరినారు

# వరి వద్దు.. ఆయిల్‌పామ్ ముద్దు...

» సత్తుపల్లి ప్రాంత రైతుల్లో మారుతున్న ట్రెండ్
» ఏడాదికేడాది పెరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు
» లాభదాయకంగా ఉండటంతో రైతుల మొగ్గు
» 24 వేల ఎకరాల నుంచి 19 వేల ఎకరాలకు పడిపోయిన వరి సాగు విస్తీర్ణం
» వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రభుత్వ ప్రోత్సాహకాలు



సత్తుపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి నెలవుగా ప్రసిద్ధిపొందిన సత్తుపల్లి ప్రాంతంలో ఆయిల్‌పామ్ సాగు ఏడాదికేడాది గణనీయంగా పెరుగుతోంది. ఆయిల్‌పామ్ పరిశ్రమలు సమీపంలో ఉండటం... ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో ఈ ప్రాంత రైతులు వరి సాగు నుంచి ఆయిల్‌పామ్ వైపు మళ్లుతున్నారు. గడిచిన రెండేళ్ల కాలంలో 5 వేల ఎకరాల్లో రైతులు కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టారు. ఇప్పటి వరకు రైతులు ప్రధాన పంటగా వరి సాగు చేస్తుండగా, మారిన పరిస్థితులతో ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఒకప్పుడు ఇక్కడ మామిడి తోటలను అధికంగా పెంచేవారు. అవి లాభదాయకంగా లేకపోవడంతో పూర్తిగా తొలగించారు. క్రమేణా నీటి వసతి పెరగటంతో వరి పంటను చేపట్టి అధికంగా సాగు చేస్తూ వచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం నుంచి ఆయిల్‌పామ్‌కు మంచి ప్రోత్సాహం లభిస్తుండటంతో పాటు మద్దతు ధర, మార్కెటింగ్ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఆయిల్‌పామ్ లాభదాయకమైన పంటగా మారిపోయింది. ఆశించిన దిగుబడి, సమీపంలో ఆయిల్‌పామ్ కర్మాగారాలు కూడా ఏర్పాటు కావటంతో రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లారు.

సత్తుపల్లి మండలంలో మొత్తం 28వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా వీటిలో కూరగాయలు, పండ్ల తోటలు 2 వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. మరో 2 వేల ఎకరాల్లో గతం నుంచి ఆయిల్‌పామ్ సాగవుతోంది. 24 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. గత రెండేళ్ల కాలంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించి తోటలను సాగు చేస్తూ వస్తున్నారు. దీంతో రెండేళ్ల కాలంలో 5 వేల ఎకరాల్లో కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టగా, వరి సాగు 19 వేల ఎకరాలకు పడిపోయింది. ఉపాధిహామీ పథకం కింద ప్రోత్సహిస్తుండటంతో గిరిజనులు కూడా ఆయిల్‌పామ్ తోటల సాగు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట, అప్పారావుపేటలలో ఆయిల్‌పామ్ పరిశ్రమలు నడుస్తున్నాయి. ఆయిల్‌పామ్ పరిశ్రమలు సమీపంలో ఉండటంతో పాటు ధర కూడా ఆశాజనకంగా ఉండటం, భూములు ఆయిల్‌పామ్‌కు అనుకూలంగా ఉండటం రైతులను ఆకర్షిస్తోంది. తాజాగా వేంసూరు మండలంలో మరో ఫ్యాక్టరీ అందుబాటులోకి రానుండటంతో విస్తీర్ణం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.


ఇటీవల శిక్షణ పూర్తయిన కానిస్టేబుళ్లు

## పోలీస్ కార్ఖానా..
# శిక్షణలో రాటుదేలేలా..

**ఖమ్మంలో పోలీసులకు శిక్షణ ఇచ్చేందుకు ఒకే ఒక ట్రైనింగ్ సెంటర్ ఉంది. ఇతర జిల్లాలకు చెందిన వారు పోలీస్ కానిస్టేబుల్ గా ఎంపికైతే ఇక్కడ శిక్షణ ఇస్తారు. తుపాకులు కాల్చే దగ్గర నుంచి, దొంగలను చేజ్ చేసి పట్టుకునేందుకు బాడీను ఫిట్ చేసి పంపుతారు. యుద్ధం చేసేందుకు సైతం వెనుకాడని విధంగా తర్ఫీదు ఇస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 కేంద్రాలు ఉండగా అందులో ఖమ్మంలో కూడా ఒకటి ఉండటం విశేషం. ఇక్కడ 500మంది ఉండే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి.**

- ఖమ్మం పీటీసీలో కానిస్టేబుళ్లకు ప్రొఫెషనల్ ట్రైనింగ్
- ఇప్పటికి 8బ్యాచ్‌లలో 1692మందికి తర్ఫీదు
- కొత్త న్యాయ చట్టాలపై ప్రత్యేక శిక్షణ
- 8 సబ్జెక్టులపై పరీక్ష నిర్వహణ
- 50శాతం మార్కులు రాకుంటే శిక్షణ పునరావృతం
- కేంద్రంలో ఉన్నప్పుడు రూ. 13,500 స్టైఫండ్

ఖమ్మం క్రైం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పోలీస్ శిక్షణ కేంద్రంలో ఇండోర్, అవుట్‌డోర్ విభాగాల్లో ట్రైనింగ్ ఇస్తారు. పోలీస్ శాఖలో ఉండే 12రకాల తుపాకుల గురించి, అవి పనిచేసే విధానం, ఏవిధంగా బుల్లెట్లు లోడ్ చేయాలి, ఫైరింగ్,లాటీ డ్రిల్, వెపన్ డ్రిల్ వంటి వాటిపై శిక్షణ ఇస్తారు. ఈశిక్షణలో భాగంగా రఘునాథపాలెం, మంచుకొండ దగ్గరలోని గుట్ట వద్ద ఫైరింగ్ నేర్పిస్తారు. వారానికి ఒకసారి 5కే రన్ నిర్వహిస్తారు. చట్టాలపై అవగాహన కల్పిస్తారు. సైబర్ క్రైం, ఫోరెన్సిక్ తదితర అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడుకోవడంలో తర్ఫీదు ఇస్తారు.

### ఇప్పటివరకు 8బ్యాచ్‌లకు శిక్షణ

2007లో ఖమ్మం పరేడ్ మైదానంలో ప్రారంభించిన పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఇప్పటికి 8 పోలీస్ కానిస్టేబుల్ బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకున్నాయి. ఉమ్మడి ఏపీలో నాలుగు బ్యాచ్‌లు, తెలంగాణ రాష్ట్రంలో నాలుగు బ్యాచ్‌లు ఇక్కడ శిక్షణ పొందాయి. తొమ్మిది నెలల పాటు సాగే శిక్షణ కోసం వచ్చిన అభ్యర్థులకు ఎనిమిది సబ్జెక్టులు ఉంటాయి. పరీక్షలు 800 మార్కులకు జరుగుతాయి. వీటిల్లో 50శాతం మార్కులు తెచ్చుకోవాలి. లేకుండా మళ్ల రెండు నెలల పాటు ట్రైనింగ్ నిర్వహిస్తారు. ఉదయం 5గంటలకు లేచి శిక్షణ ప్రారంభిస్తే రాత్రి 8గంటల వరకు కొనసాగుతుంది. శిక్షణలో స్టైఫండ్ కింద రూ.13500 జీతం చెల్లిస్తారు. సీటీసీలో శిక్షణ ఇచ్చేందుకు ఇండోర్ విభాగంలో 20మంది, అవుట్‌డోర్ విభాగంలో 33 మంది ఫ్యాకల్టీ ఉన్నారు.



**చిరుతల్లా తర్ఫీదు ఇస్తున్నాం...**

అన్నింటికీ తట్టుకునేలా, ప్రజలకు అండగా ఉండేలా, సాయం చేసేలా ఒక చిరుతపులిలా శిక్షణ ఇచ్చి పంపుతున్నాం. పోలీస్ శాఖలో ఉద్యోగం అంటే ఉద్యోగం చేశామా వెళ్లామా అన్న విధంగా కాకుండా అందరికి మేమున్నాం అని భరోసా ఇచ్చే విధంగా ఉండాలి. అందుకోసం ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం.

ఎ. నరేష్ కుమార్,
అడిషనల్ డీపీపీ అడ్మిన్, సీటీసీ ప్రిన్సిపాల్



ఖమ్మంలోని శిక్షణ కేంద్రం

### ఇప్పటి వరకు 1,692మందికి శిక్షణ..

ఖమ్మంలో ఇప్పటి వరకు 1,692మంది కానిస్టేబుళ్లకు శిక్షణ ఇచ్చారు. 2007 ఏప్రిల్ 17న మెదటి బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభం కాగా 2008 జనవరి 4న శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఇప్పటి వరకు ఎనిమిది బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తారు. 8వబ్యాచ్ 2024ఫిబ్రవరి 21న ప్రారంభం కాగా 2024 నవంబరు 21న శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిలో రాచకొండకు చెందిన ఏఆర్ కానిస్టేబుళ్ల 92 మంది, రామగుండం, వికారాబాద్‌కు చెందిన సివిల్ కానిస్టేబుళ్లు 171మంది ఉన్నారు. కాగా 8వ కానిస్టేబుల్ బ్యాచ్‌లో డిగ్రీ పూర్తి చేసిన వారే అధికంగా ఉన్నారు.

# ఎట్టకేలకు ఏజెన్సీలో వైద్య శిబిరాలు

- ఏర్పాటుకు రంగం సిద్ధం
- డిసెంబరు మొదటి వారంలో శ్రీకారం
- క్యాంపు నిర్వహణకు భారీగా తగ్గిన బడ్జెట్


ఏజెన్సీలో మెడికల్ క్యాంపు(ఫైల్)

భద్రాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఏజెన్సీలో వైద్య శిబిరాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. డిసెంబరు మొదటి వారంలో మణుగూరు నుంచి వైద్య శిబిరాల నిర్వహణకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించగా ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆమోదం తెలపాల్సి ఉంది. వాస్తవానికి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా వైద్య శిబిరాలు ఆగస్టు, సెప్టెంబరు నెలలో నిర్వహించాల్సి ఉండగా వివిధ కారణాలతో అవి డిసెంబరులో నిర్వహించే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ గ్రామాలలో వారానికి రెండు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలనే యోచనలో అధికారులు ఉన్నారు. గైనకాలజీ, చెవి, ముక్కు, గొంతు, పిల్లల వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్, కంటి వైద్యులతో పాటు సాధారణ వైద్యులతో ఈ వైద్య శిబిరాలను నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ భావిస్తోంది. వాస్తవానికి 50 శిబిరాల నిర్వహ ణ కు అనుమతులు వచ్చినా ముందుగా 30 శిబిరాలు నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### క్యాంపు నిర్వహణకు భారీగా తగ్గిన బడ్జెట్

ఏజెన్సీలో వైద్య శిబిరాల నిర్వహణకు బడ్జెట్ భారీగా తగ్గినట్లు వినికిడి. గతంలో ఒక క్యాంపు నిర్వహణకు రూ.55 వేలు కేటాయించగా ఇటీవల రూ.30 వేలు కేటాయిస్తున్నట్లు సమాచారం. రెండేళ్ల నుంచి జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి ఈ రీతినే క్యాంపుల నిర్వహణకు బడ్జెట్ వస్తున్నట్లు తెలిసింది. వాస్తవానికి క్యాంపుల నిర్వహణ సమయంలో నైపుణ్య వైద్యులు రోగులను పరీక్షించి రక్త పరీక్షలు, మందులు రాస్తే వాటిని వైద్య ఆరోగ్య శాఖే రోగులకు అందించాల్సి ఉంటుంది. ఇందుకోసం అవసరమైన కీలక మందులను సైతం వైద్య ఆరోగ్య శాఖ కొనుగోలు చేస్తుంది. బడ్జెట్ తగ్గటంతో మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. వర్షాకాలంలో విష జ్వరాలు ప్రబలుతున్న సమయంలో నిర్వహించాల్సిన వైద్యశిబిరాలు ఎట్టకేలకు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్న క్రమంలో ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాలతో ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రచారం చేయాల్సిన బాధ్యత అధికార వర్గాలపై ఉంది.

### క్లినికల్ అప్రెంటిస్ శిక్షణకు
## దరఖాస్తుల ఆహ్వానం

- ఇంటర్ మీడియట్ విద్యాధికారి రవిబాబు

ఖమ్మంటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మీడియట్ ఎంపీడబ్ల్యూహెచ్ (ఫిమేల్) ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు క్లినికల్ అప్రెంటిస్ శిక్షణ కోసం ఈనెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి కె. రవిబాబు ఒక ప్రకటనలో కోరారు. ఈ శిక్షణ ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉంటుందన్నారు. శిక్షణకు ఎంపికైన వారు ఆసుపత్రి పేరున రూ.1000 డీడీ రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకొని ఎంపిక కానివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు తమ బయోడేటా ఫారంతో పది రూపాయల పోస్టల్ స్టాంపులు అంటించిన స్వంత చిరునామా కవర్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను జతపరిచి, కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఈనెల 29వ తేదీలోపు అందజేయాలని కోరారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగిరం చేయాలి

- ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లను సకాలంలో పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై సీఎం, పౌర సరఫరాల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలులో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలు, సన్నరకంధాన్యం కొనుగోలుకు 500 రూపాయల బోనస్ తదితర అంశాలను వివరించారు. నిర్దిష్ట సమయంలో ధాన్యం సేకరణ పూర్తి కావాలని ఆదేశించారు.

### 29న జరిగే దీక్షాదివస్‌ను
## విజయవంతం చేయండి

- దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



ఖమ్మంటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు ఈనెల 29న జిల్లా కేంద్రమైన ఖమ్మంలో నిర్వహించే దీక్షా దివస్‌ను జయప్రదం చేయాలని దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు కోరారు. మంగళవారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధసంఘాల అధ్యక్షులతో నిర్వహించిన జిల్లాస్థాయి సన్నాహక సమావేశంలో రవీందర్‌రావు మాట్లాడారు. తెలంగాణా మలిదశ ఉద్యమాన్ని మలుపుతిప్పిన కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షను గుర్తు చేసుకుంటూ దీక్షా దివస్ నిర్వహిస్తున్నామన్నారు. 2009, నవంబరు 29న కేసీఆర్ చేపట్టిన దీక్ష చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి దీక్షాదివస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఉద్యమస్ఫూర్తిని ప్రజల్లో తిరిగి రగిలించే దిశగా దీక్షాదివస్ చేపడుతున్నామన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, బాణోత్ చంద్రవతి, జెడ్పీ డీసీసీబీ, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు లింగాల కమల్‌రాజ్. కూరాకుల నాగభూషయ్య, గుండాల కృష్ణ, జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు తాజుద్దీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, ఉద్యమనాయకులు, కార్పొరేటర్లు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామాలయంలో ఆర్థిక క్రమశిక్షణ

- ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి తీసుకున్న డబ్బులో రూ.5కోట్లు తిరిగి జమ
- అన్ని రకాల చెల్లింపులు సకాలంలోనే...
- దేవస్థానం ఈవో నిర్ణయాలతో ఫలితాలు

భద్రాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈవో ఎల్. రమాదేవి తీసుకుంటున్న ఆర్థిక క్రమ శిక్షణ చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. కరోనా సమయంలో దేవస్థానం ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి తీసుకున్న రూ.ఆరు కోట్లలో తిరిగి రూ.5 కోట్లు జమ చేయడం విశేషం. పారదర్శక పాలన, ఆర్థిక క్రమశిక్షణ చర్యలు, ఆన్‌లైన్ సేవల కారణంగా దేవస్థానం ఖజానకు లోటు లేదని దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. గత దశాబ్దకాలంగా అర్చక వెల్ఫేర్ ఫండ్, కామన్ గుడ్ ఫండ్, ఎంప్లాయీస్ వెల్ఫేర్ ఫండ్‌లు భద్రాద్రి దేవస్థానం చెల్లించాల్సి ఉండగా అవి పెండింగులో ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పటి వరకు సుమారు రూ.12 కోట్ల వరకు చెల్లించినట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి.

### నాడు ప్రభుత్వ అనుమతితో ...

కరోనా కాలంలో దేవస్థానంలో పని చేస్తున్న ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టు సిబ్బంది జీతాలు, వేతనాలు చెల్లించడం నాడు ఎంతో కష్టంగా మారింది. అలాగే నాటి శ్రీరామనవమి బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించడం గగనమైంది. ఆనాడు దేవస్థానంలో పని చేస్తున్న వారికి ఐదు నెలలుగా జీతాలు పూర్తిస్థాయిలో చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా చివరి మూడు నెలలుగా పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారడంతో ఉద్యోగుల జీతాలు చెల్లించలేదు. దీంతో ఆనాడు భద్రాద్రి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు నిర్వహించిన ప్రస్తుత ఈవో రమాదేవి దేవస్థానంలో ఆర్థిక కష్టాలను గురించి పూర్తిగా అధికారులకు వివరించారు. ఈ క్రమంలో భద్రాద్రి దేవస్థానం వద్ద జనరల్ ఫండ్‌లో ఉన్న రూ.6 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను విత్‌డ్రా చేసేందుకు ప్రభుత్వ అనుమతి కోరారు. ఈ క్రమంలో అప్పటి దేవాదాయ శాఖ కమీషనర్ అనిల్‌కుమార్ అనుమతిస్తూ ఆమోద ముద్ర వేసారు. దీంతో ఉద్యోగుల జీతాల చెల్లింపులతో పాటు శ్రీరామనవమి బిల్లుల చెల్లింపులు, ఇతరత్రా చెల్లింపులు చేసేందుకు మార్గం సుగమం అయ్యింది.

### నాలుగేళ్ల తరువాత జమ

2020 సెప్టెంబర్లో జనరల్ ఫండ్ నుంచి రూ.6 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉపసంహరించగా వాటిలో రూ.5 కోట్లు జీతాలు, వేతనాలు, శ్రీరామ నవమి బిల్లుల కోసం అధికారులు చెల్లింపులు చేశారు. ఈ క్రమంలో రూ.ఒక కోటి మిగిలి ఉంది. ప్రస్తుతం ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న రమాదేవి నాడు తాను ఇన్‌చార్జి ఈవోగా ఉన్న సమయంలో ఉప సంహరించిన మొత్తం రూ.5 కోట్లు మళ్లీ జనరల్ ఫండ్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్లకు జమ చేయడం విశేషం. దీంతో మళ్లీ మొత్తం జనరల్ ఫండ్‌లో రూ.6 కోట్లు జమయ్యాయి. కాగా నాడు ప్రత్యేకపరిస్థితుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఉపసంహరించగా నేడు ఈవోగా తానే ఉన్న సమయంలో వాటిని మళ్లీ జమచేయటం ఆమెకెంతో సంతృప్తినిచ్చిందని ఈవో రమాదేవి పేర్కొన్నారు.

## పైన కోటింగ్.. లోన చీటింగ్..

(5వ పేజీ తరువాయి)

తీసుకుని పరీక్ష నిర్వహిస్తారు. ఆభరణాల లోన కట్‌చేసి చూసే అవకాశం ఉండదు. దీనిని అవకాశంగా చేసుకుని బంగారు చేతి కడియాలకు లోన వెండినిపెట్టి పైన బంగారు పూతను మందంగా ఉంచడంతో పరీక్షల్లో అసలు బంగారంగానే తేలింది. కాగా ఖమ్మంలో ఏపీజీవీబీతో పాటు మరికొన్ని వాణిజ్య , ప్రైవేటు బ్యాంకుల్లో ఈ నకిలీ బంగారు కడియాలతో పెద్దఎత్తున రుణాలు తీసుకన్నారని ప్రచారం జరుగుతుండడంతో ఆయా బ్యాంకులు తాకట్టులో ఉన్న కడియాల రుణగ్రస్తులను పిలిపించి వాస్తవాలు తెలుసుకుంటున్నారు. అయితే ఇప్పటికే అప్పు తీసుకున్న ఖాతాదారులు కొందరు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

## ఒక పంచాయతీ.. ఒక మండలం..

(5వ పేజీ తరువాయి)

కలిపారు. బాధకరమైన విషయం ఏమిటంటే భద్రాచలం పంచాయతీ పరిధిలోని రాజుపేటలో ఒక కాలనీ, ఆదర్శనగర్‌లోని శివారు ప్రాంతం ఏపీ పరిధిలోని అల్లూరి జిల్లా యటపాక మండలంలోకి వెళ్లాయి.

### నేడు ఒక పంచాయతీకే పరిమితం

భద్ర్రాచలం మండలపరిషత్ పరిధి ఒక పంచాయ్తీకే పరిమితం కానుంది. మండల పరిషత్ పునరుద్ధరించడంతో మళ్లీ భద్రాచలంలో ఎన్నికల సందడి నెలకొననుంది. ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చివరిసారి 2020 జూలై 3న అప్పటి మండలపరిషత్ పాలక వర్గం కాలపరిమితి ముగియగా ఊకే శాంతమ్మ ఎంపీపీగా, జి.రవికుమార్ జడ్పీటీసీగా పని చేశారు. మళ్లీ మండలపరిషత్ పునరుద్ధరించడంతో రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు భద్రాచలంలో సైతం జరగనున్నాయి.

ఇదిలా ఉండగా తాజాగా భద్రాచలాన్ని మండల పరిషత్‌గా ప్రకటించడంతో గత దశాబ్దకాలంగా ఏపీ పరిధిలో ఉంటున్న గుండాల, పురుషోత్తపట్నం, యటపాక, పిచుకలపాడు, కన్నాయిగూడెం పంచ్యాయతీలను భద్రాచలంలో విలీనం చేయాలనే డిమాండ్ మళ్లీ చర్చకు వస్తోంది.

### ప్రభుత్వ వైద్యకళాశాలకు
## మహర్దశ

- నూతన భవన సముదాయానికి డిసెంబరు 5న శంకుస్థాపన
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవన నిర్మాణ పనులకు వచ్చే నెల 5న శంకుస్థాపన చేయనున్నట్లు ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. శంకుస్థాపనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

రఘునాథపాలెం వద్ద నిర్మించనున్న ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవన నిర్మాణ ప్రదేశాన్ని మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ వైద్య కళాశాల శంకుస్థాపనకు రాష్ట్ర మంత్రులు రానునన్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మెడికల్ విద్యార్థుల అవసరాల దృష్ట్యా నూతన వైద్య కళాశాల భవన నిర్మాణం కోసం రఘునాథపాలెం వద్ద భవన నిర్మాణ పనులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మంత్రులతో శంకుస్థాపనకు అన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఉంటే దానికి తగ్గ ఏర్పాట్లను కూడా సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత తదితరులు ఉన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం..

- ప్రతిజ్ఞ చేయించిన భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్


ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

కొత్తగూడెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని భద్రాద్రి కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు.అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు 75వ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగం ద్వారానే నేడు అందరు ఫలాలను అందుకుంటున్నారని, సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో ఎలాంటి వివక్షకు తావు లేకుండ అందరికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు వస్తున్నాయంటే అది రాజ్యాంగం కల్పించిన గొప్పతనమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, సీపీవో సంజీవరావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, వివిధశాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

### నివాళులర్పించిన ఎస్పీ రోహిత్‌రాజ్

ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా భారత రాజ్యాంగానికి ప్రపంచ దేశాలతో ఎంతో గుర్తింపు ఉందని, మనమంతా రాజ్యాంగ స్ఫూర్తితో పని చేస్తూ ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందించాలని ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అంబేద్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వార దేశంలోని ప్రజలందరికి ప్రాథమిక హక్కులను కల్పించడంతోపాటు ప్రజల ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకునే చట్టాలను సైతం పొందుపర్చారని తెలిపారు. అనంతరం అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు పోలీస్ అధికారులు, సిబ్బంది చేత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు చంద్రభాను, అబ్దుల్ రెహ్మాన్, సతీష్‌కుమార్,

రవీందర్‌రెడ్డి, మల్లయ్యస్వామి, ఎఆర్ డీఎస్పీ సత్యనారాయణ, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అడిషనల్ డీసీపీగా వెంకట్రావు



ఖమ్మం క్రైం నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీగా గంటా వెంకట్రావును నియమిస్తూ పోలీసుశాఖ ఉన్నతాధికారులు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవా రం రాత్రి అడిషన్ ఎస్పీ కార్యడర్ పలువురు అధికారులను బదిలీచేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఆర్పీవీఆర్ ఆర్‌టీజీపీఏ విభాగంలో విధులు నార్వహిస్తున్న వెంకట్రావును ఖమ్మం అడిషనల్ డీసీపీగా నియమించారు. ప్రస్తుతం ఖమ్మంలో విధులు నిర్వహిస్తున్న జి.ప్రసాద్‌రావును హైదరాబాద్ సిటీ ట్రాఫిక్‌కు బదిలీచేశారు. వెంకట్రావు గతంలో ఖమ్మంలో పలు హోదాలలో విధులు నిర్వహించారు.

## ఐఏఎల్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- ఐఏఎల్ ఖమ్మం జిల్లా యూనిట్ ప్రతినిధి బృందం పిలుపు


ఐఏఎల్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌తో న్యాయవాదులు

ఖమ్మం లీగల్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని హరితా కాకతీయ హోటల్ ఈ నెల 30, డిసెంబరు 1 రెండురోజులు నందు జరుగనున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) రాష్ట్ర రెండో మహాసభలను జయప్రదం చేయాలని ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు న్యాయవాదులకు పిలుపునిచ్చారు. ఖమ్మం కోర్టు ఆవరణలో మాహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వం డెమొక్రటిక్ అడ్వకేట్ అసోసియేషన్‌గా ఉన్న సంఘం 1973లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్)గా అవతరించిందని వారు గుర్తు చేశారు. న్యాయవాదుల సమస్యలపై పోరాటం చేసిన తొలి న్యాయవాదుల సంఘం ఐఏఎల్ అన్నారు.

గొప్ప న్యాయ కోవిదులు జస్టిస్ కృష్ణయ్యర్, జస్టిస్ డి.ఏ.దేశాయ్, జస్టిస్ పి.ఎస్.భగవతి, జస్టిస్ ఈ.ఎస్.వెంకటరంగయ్య, జస్టిస్ ఓ.చిన్నప్పరెడ్డి లాంటి మహా మహనీయులు ఈ అసోసియేషన్ స్థాపనలో ముఖ్య భూమిక పోషించారని వారు తెలిపారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజా న్యాయవాదిగా పేరు గావించిన శ్రీ పద్మనాభరెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో ఐఏఎల్‌ను నిర్మించడంలో ప్రముఖ పాత్ర పోషించారని వారు కొనియాడారు. నవంబరు 30, డిసెంబరు 1 తేదీలలో జరిగే ఐఏఎల్ రాష్ట్ర మహాసభలకు ప్రముఖ న్యాయ కోవిదులు హాజరై ప్రసంగించనున్నట్లు వారు తెలిపారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై మహాసభలలో చర్చించనున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమలో సీనియర్ న్యాయవాది పాటిబండ్ల సంజయ్‌కుమార్, ఐఏఎల్ జిల్లా సహాయ కార్యదర్శి మేకల నవీన్‌కుమార్, జి.వి. లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, ఎం.డి.పర్వేజ్, ముత్యం దామోదర్, గాజుల అమర్‌నాథ్, ఆర్.రాకేష్, ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైం సమాచారం

## చిన్న రావిగూడెం ఇసుక తోలకాలపై మళ్లీ వివాదం

**వేలందారుడి తోలకాలు అడ్డగింత**

**ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం**

**పోలీసుల రంగ ప్రవేశం ఆగిన ఘర్షణ**

మణుగూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మణుగూరులోని చిన్నరావిగూడెం ఇసుక ర్యాంపు ఇసుక తోలకాలపై మళ్లీ వివాదం మంగళవారం చోటు చేసుకుంది. సొసైటీ సభ్యులకు, మిగులు ఇసుకను వేళం ద్వారా పొందిన వారి వర్గానికి మధ్య వాగ్వాదం ఘర్షణ వరకు దారితీసింది. వేలం ద్వారా స్టోరేజి ఇసుకను పొందిన వ్యక్తి రమేష్ అనే వ్యక్తి తనకున్న ఆధారాలతో ఇసుకను లారీల ద్వారా తోలకాలు జరిపేందుకు మంగళవారం చర్యలను చేపట్టాడు. మూడు లారీలు స్టోరేజీ ప్రాంతంలో లోడింగ్ అయ్యే సమయంలో సొసైటీకి చెందిన పీవీ చారీ వర్గీయులు సొసైటీ సభ్యులు అంతా అక్కడికి చేరుకున్నారు. ఈ ఇసుక సొసైటీకి సంబంధించి దానిని తామే సొసైటీ తరుపున తోలకాలు జరుపుకుంటాయని పట్టుబట్టారు. దీంతో వేలం ద్వారా ఇసుక పొందిన గంటా రమేష్ వర్గీయులకు, పీవీ చారీ వర్గీయులకు మధ్య వాగ్వాదం పెద్దదిగా తయారై ఘర్షణకు చోటు చేసుకుంది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు అందటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘర్షణ సద్దు మణిగించారు. సాయంత్రం పోలీసు స్టేషన్‌కు వచ్చి అధికారులకు విషయాన్ని తెలపాలని పోలీసు సిబ్బంది ఇరువర్గాలకు తెలిపారు. లోడ్ అయిన మూడు లారీలను బయటికి పంపించారు.

## చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మం లీగల్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని లెనిన్‌నగర్‌కు చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లుకు చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష తోపాటు ఫిర్యాదికి నష్టపరిహారం కింద రూ.2లక్షలు చెల్లించాలని ఖమ్మం మద్యపాన ఆబ్కారీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి రాళ్లబండి శాంతిలత మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఖమ్మం నగరం నరసింహస్వామి టెంపుల్ రోడ్డు ప్రాంతానికి చెందిన పిరంగి శ్రీధర్ ఫిర్యాది వద్ద నింధితుడు తన కుటుంబ అవసరాల నిమిత్తం 31 డిసెంబరు 2014న రూ.రెండు లక్షలు రుణముగా తీసుకొని అదే రోజు ప్రాంసరీ నోటు రాయించి ఇచ్చినాడు. తరువాత ఫిర్యాది తన రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడిచేయగా నిందితుడు ఫిర్యాదికి చెక్కు జారీచేసిన రెండు లక్షలకు ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేయగా నిందితుని ఖాతాలో సరిపడ నగదు లేనందున తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటుకేసు దాఖలుచేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

ఖమ్మంక్రైం/కామేపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని లారీ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడినసంఘటన మంగళవారం ఖమ్మం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం కామేపల్లి మండలం మర్రిగూడేనికి చెందిన వంక రామారావు (40) భార్య ఆరేళ్ల క్రితం వదిలేసి వెళ్లడంతో నగరంలోని బైపాస్ రోడ్డు సమీపంలోని లారీ ఆఫీసులో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం లారీ ఆఫీస్ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని మృతిచెంది ఉండడంతో గమనించిన సెక్యూరిటీ గార్డు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. వారు వచ్చి పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. ఈ ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

**యువకుడి బలన్మరణం**

కామేపలి(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు బలన్మరణానికి పాల్పడ్డ సంఘట న కామేపల్లి మండల పరిధిలోని జాస్తిపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం జాస్తిపల్లికి చెందిన ఉల్లోజీ వంశీ(22) ఇంటర్‌విద్యను పూర్తి చేశాడు. ప్రస్తుతం పెయింటర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి తల్లిదండ్రులు ఉన్నారు. మృతికి కారణాలు తెలి యాల్సి ఉంది.

## ఖమ్మం కొత్త బస్టాండ్‌లో అనారోగ్యంతో మహిళ మృతి

**మృతదేహాన్ని ఇంట్లోకి తీసుకు రానివ్వని ఇంటి యజమాని**

**అన్నం ఫౌండేషన్ సహాయంతో అంత్యక్రియలు పూర్తి**



అద్దె ఇంటివాళ్లు వద్దనడంతో మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

ఖమ్మంక్రైం నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ మహిళ ఖమ్మం కొత్తబస్టాండ్‌లో మంగళవారం మృతిచెందింది. స్థానికుల కథనం ప్రకారం దానవాయిగూడెంలో అద్దెఇంటిలో నివాసం ఉంటు న్న గుంజ తిరపమ్మ (28) అనే మహిళ తన భర్తతో గొడవపడి ఒంటరిగా హైదరా బాదులో ఉంటుంది. కొద్దిరోజులుగా ఆమె అనారోగ్యంపాలై చికిత్స ఎందుతూ మంగళవారం ఉదయం ఖమ్మం బస్టాండ్‌కు చేరింది. ఈ క్రమంలో అక్కడ మృతిచెందగా గుర్తించిన బస్టాండ్ సిబ్బంది టుటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో టుటౌన్ పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కొద్దిసేపటి తర్వాత మృతురాలి వివరాలు తెలుసుకున్న పోలీసులు అన్నం శ్రీనివాసరావు సహకారంతో దానవాయిఆగూడెంలోని తాను అద్దెకుంటున్న ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ఇంటి యజమానులు ఇంటిముందు మృతదేహాన్ని ఉంచవద్దని చెప్పడంతో కుటుంబసభ్యులందరు బోరున విలపించారు. అక్కడే ఉన్న అన్నం శ్రీనివాసరావు మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్‌కు తెచ్చారు. అక్కడ కొద్దిసేపు ఉంచి కుటుంబ సభ్యులందరు వచ్చిన తర్వాత మృతదేహాన్ని అంత్యక్రియలు నిర్వహించేందుకు డబ్బులు లేకపోవడంతో అన్నం శ్రీనివాసరావు మృతదేహానికి బల్లెపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి



గోపి(ఫైల్)

చంద్రుగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండల పరిధిలోని రావికంపాడు గ్రామంలో మంగళవారం సాయత్రం గుమ్మ గోపి(24) విద్యుత్‌షాక్ గురై మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసుల కధనం ప్రకారం గోపి ఇంటి సర్వీస్ వైర్‌కు ప్రమాదవశాత్తు తగలటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం కోసం కొత్తగూడెం తరలించారు. కాగా మృతుడు గోపికి భార్య అశ్వని, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


## గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకుడి..

వైరా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైరాలోని శాంతినగర్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక యాచకుడు మృతిచెందాడని వైరా ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ మంగళవారం తెలిపారు. ఈనెల 22వతేదీ సాయంత్రం జరిగిన సంఘటనకు సంబంధించి ఎస్ఐ ఓ ప్రకటన విడుదల చేశారు.

మృతుడి పేరు సయ్యద్ రఫీ అని, కొత్తగూడెంలోని మేదరబస్తీకి చెందినవాడిగా సమాచారం ఉందని పేర్కొన్నారు. వివరాలకు 8712659148 నెంబర్‌ను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

## నిబంధనలు పాటించని ఆస్పత్రులకు జరిమానా

**రెండు ఆస్పత్రులకు ఫైన్ విధించిన కేఎంసీ అధికారులు**



ఆస్పత్రి నిర్వాహకులకు అందిస్తున్న జరిమానా నోటీసు

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మెడికల్, బయో వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై పడేసిన ప్రవేట్ హాస్పటల్‌పై ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు కొరడ ఝులిపించారు. పాత బస్టాండ్ సమీపంలోని బాలాజీనగర్‌లో ఎస్‌వీ పిల్లల హాస్పటల్ నిర్వాహకులు మెడికల్ వ్యర్థాలను ప్రధాన రహదారిపై పడేశారు. గతంలో పలుమార్లు చెప్పినా హాస్పటల్ నిర్వాహకుల తీరు మారలేదు. దీంతో పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య ఆధ్వర్యంలో తనిఖీలు చేసి హాస్పటల్స్ నిర్వాహకులకు రూ.3వేలు జరిమాన విధించారు. మరోసారి ఇలానే చేస్తే భారీ జరిమాన విదిస్తామని హెచ్చరించారు.

**నవీన ఆస్పత్రికి రూ.2వేల జరిమాన**

రహదారులను అక్రమించి బోర్డులు ఏర్పాటు చేయటంపై కేఎంసీ అధికారులు జరిమాన విధించారు. ఖమ్మంనగరంలోని 43వ డివిజన్ బాలాజీనగర్‌లోని నవీన ప్రైవేట్ హాస్పటల్స్ నిర్వాహకులు తమ హాస్పటల్ బోర్డులను రహదారిపై ఏర్పాటు చేశారు. పరిశీలించిన కేఎంసీ అధికారులు రూ.2వేలు జరిమాన విధించారు.

# తుది దశకు మూడో రైల్వేలైన్ పనులు

**ముమ్మురంగా సాగుతున్న పనులు**

**ఖమ్మం జిల్లాలో 80 కిలోమీటర్ల మేర**

**మూడో రైల్వే లైన్ పనులు**

**పాపటపల్లి నుంచి పందిళ్లపల్లి వరకు**

**కొనసాగుతున్నపనులు**



ఖమ్మం నర్తకీ టాకీస్, సారధినగర్ ప్రాంతాలో పనులను నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల మధ్య రాకపోకలకు కీలకమైన సికింద్రాబాద్- విజయవాడ మూడో రైలుమార్గం పనులు తుది దశకు చేరాయి. ఈ పనుల నేపథ్యంలో కాజీపేట-ఖమ్మం- విజయవాడ మీదుగా రైల్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో పలు రైళ్లను దారి మళిస్తున్నారు.. మరికొన్ని డోర్నకల్ జంక్షన్ పరిధిలోని ఇంజినీరింగ్, సిగ్నల్ అండ్ టెలీ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, ఓహెచ్, ఆపరేటింగ్ కన్‌స్ట్రక్షన్ విభాగాలకు చెందిన అధికారులు, కూలీలు దాదాపు 400 మంది పైగానే పనులు చేస్తున్నారు. ఆధునిక యంత్రాలు వినియోగిస్తున్నారు.

● సికింద్రాబాద్ నుంచి కాజీపేట, ఖమ్మం నుంచి విజయవాడ రైల్వేస్టేషన్ వరకు మూడో రైల్వేలైన్ మూడోలైన్ పనులను మరో రెండునెలల్లో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నారు. గడువులోపు పనులు పూర్తయ్యేలా రైల్వే అధికారులు పర్యవేక్షిస్తున్నారు. డోర్నకల్ జంక్షన్ పరిధిలో పాపటపల్లి వరకు పనులు కొనసాగగా ప్రస్తుతం ఖమ్మం రైల్వేస్టేషన్ పరిధిలో మల్లెమడుగు, సారధినగర్, నర్తకీ టాకీస్ ప్రాంతం, పందిళ్లపల్లి వరకు పనులు సాగుతున్నాయి. ఇప్పటికే నాగులవంచ బోనకల్, మధిర ఎర్రుపాలెం వరకు మూడోలైన్ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఖమ్మం పరిధిలోని పందిళ్లపల్లి, సారధినగర్ నుంచి పాపటపల్లి వరకు పనులు ముమ్మరంగా చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో పాపటపల్లి నుంచి ఎర్రుపాలెం వరకు మొత్తం 80 కిలోమీటర్ల మేర పనులు కొనసాగుతున్నాయి. రెండేళ్ల నుంచి ఈ పనులు సాగుతుండగా ఖమ్మం నగరంలో భూసేకరణ, నిర్వాసితుల నిరాకరణతో పనులు తీవ్ర జాప్యం అయ్యాయి. నగరంలో పందిళ్లపల్లి నుంచి ఖమ్మం వరకు భూములు విలువైనవి కావడం దీనితో పాటు భవనాలు అడ్డంకిగా మారాయి. దీంతో పనులు ఆలస్యం అయ్యాయి. ఎట్టకేలకు అధికారులు వీటికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మూడు నెలలుగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖమ్మం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు కూడా అంతే వేగంతో సాగుతున్నాయి. జిల్లాలో ఖమ్మం రూరల్ మండలం పరిధిలో మున్నేరు ఆక్విడెక్ట్ వద్ద ట్రాక్‌కు కిలోమీటర్ల మేర అనుమతులు రావడానికి తీవ్ర జాప్యమైం ది. ఎట్టకేలకు ఈ ఏడాది ప్రారంభంలో అ నుమతులు రాగా పనులు ముమ్మరం చేశారు. రైల్వేలైన్ పనులతోపాటు నగరానికి అనుసంధానంగా ఉన్న అండర్ బ్రిడ్జిలు, వాగులు, డ్రెయిన్లపై వంతెనల నిర్మాణాలు కొనసాగుతున్నా.. పూర్తి కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ట్రాక్‌పనులను నిర్వహిస్తామని రైల్వే అధికారులు తెలిపారు

**గంటల తరబడి ఆలస్యం**

విజయవాడ నుంచి ఖమ్మం మీదుగా ఢిల్లీ, సి కింద్రాబాద్‌కు దాదాపు 100 ఎక్స్‌ప్రెస్, ప్యాసింజ ర్ రైళ్లు ప్రయాణిస్తుంటాయి. వీటితో పాటు మ రో 100కు పైగా గూడ్సు రైళ్లు ప్రయాణిస్తున్నా యి. ఇప్పటి వరకు రెండు ట్రాకులే ఉండడం కారణంగా సిగ్నల్స్ లేకపోవడంతో ఎక్స్‌ప్రెస్, సూ పర్ ఫాస్ట్ రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా న డుస్తున్నాయి. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు దాదాపు రెండు నుంచి 3 గంటల పాటు ఆలస్యంగా నడవాల్సివస్తోంది. దీంతో ప్ర యాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇక గూ డ్సు రైళ్లు గమ్యస్థానం చేరాలంటే నిర్దేశించిన టైం కంటే రోజుల తరబడి ఆలస్యంగా నడుస్తున్నా యి. మూడో ట్రాక్ ఏర్పాటుతో ఇటు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సూపర్‌ఫాస్ట్ రైళ్లు, చివరికి గూడ్సు రైళ్లు కూడా వేగంగా గమ్యస్థానాలకు చేరుకునే ఆ స్కారం ఉంటుందని స్టేషన్ మేనేజర్ పీఎస్వీ ప్రసాద్ తెలిపారు.

## కుల భోజనాలు వద్దు జన భోజనాలకు రండి

**1న మాస్‌లైన్ ఆధ్వర్యంలో కార్యక్రమం ● పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి**




మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలోను రాజకీయ, ఆర్థిక, వ్యాపార అవసరాల కోసం కొన్ని శక్తులు కుల వ్యవస్థను పెంచిపోషిస్తున్నాయని, కుల వ్యవస్థపై చర్చ జరిగేందుకు, సమాజంలో మార్పు కోరేందుకు కుల భోజనాలు కాదు జన భోజనాలకు రండి అంటూ పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి పిలుపునిచ్చారు. మంగళవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కుల వ్యవస్థ నిర్మూలనలో మహిళలు ముందువరసలో ఉండి పోరాటాలు చేయటం ద్వారా ప్రతి కుటుంబం నుంచి కుల వ్యవస్థ నిర్మూలన జరిగితే సమాజంలో మార్పు వస్తుందన్నారు. డిసెంబరు 1న ఖమ్మంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల వెనుక మామిడితోటలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో జన భోజనాలు ఏర్పాటు చేశామని, కుల, మతాలకు అతీతంగా ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు గోకినేపల్లి లలిత, ఆవుల మంగతాయి, ప్రతాపనేని శోభ, టీ ఝాన్సీ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వం

**కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దేవా సతీష్**

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో అమలుచేస్తున్న రాష్ట్రం కాంగ్రెస్‌లో ప్రభుత్వమని పార్టీ అధికార ప్రతినిధి దేవా సతీష్ అన్నారు. మంగళవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగంలో సూచించిన నియమ నిబంధనలను దేశంలో అమలు చేస్తున్నది కేవలం కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా అన్ని వర్గాల ప్రజలకు రావాల్సిన హక్కులను చేపట్టాల్సిన అభివృద్ధిని ప్రజలకు అందిస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పదేళ్ల తెలంగాణ అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది ఏమి లేదని విమర్శించారు. అన్ని వర్గాల నాయకులకు సమన్యాయం చేస్తూ సుపరిపాలనలో భాగస్వాములు చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సేవలు అందించే విధానాలు ఎప్పటికప్పుడు ప్రజలు గమనిస్తుంటారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పక అమలు చేస్తున్నారని కొనియాడారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశంలోనే తెలంగాణను తొలి స్థానంలో నిలుపుతామని పేర్కొన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మెంటపల్లి రాము, చర్మకారుల జేఏసి రాష్ట్ర కన్వీనర్ కూసపాటి శ్రీనివాస్, నాయకులు వెంకటయ్య, నవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు సతీష్

## దేవస్థానంలో వస్త్రాల సేకరణ టెండరు వాయిదా

భద్రాచలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వస్త్రాల సేకరణ టెండరును మంగళవారం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి వాయిదా వేశారు. వాస్తవానికి దేవస్థానం ఈవో కార్యాలయ ప్రాంగణంలో వస్త్రాల సేకరణ టెండరు ప్రక్రియను నిర్వహించగా దానికి నిర్దేశిత సంఖ్యలో పాటదారులు రాకపోవడంతో టెండరు ప్రక్రియను వాయిదా వేశారు. ఈ టెండరు ప్రక్రియను మరోసారి నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఈవో తెలిపారు.

## డీసీసీబీ ఇన్‌చార్జ్ సీఈవోగా వెంకటాదిత్య

ఖమ్మం వ్యవసాయం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కేంద్ర సహకార బ్యాంకు ఇన్‌చార్జ్ సీఈవోగా ఎస్ వెంకటాదిత్య నియమితులయ్యారు. మంగళవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. హైదరాబాద్ టెస్కాబ్‌లో ఏజీఎంగా ఉన్న ఆయనకు ఖమ్మం డీసీసీబీ ఇన్‌చార్జ్ సీఈవోగా డిప్యూటేషన్‌పై నియమించారు. గతంలో డీసీసీబీగా ఉన్న వసంతరావు తిరిగి ఆయన జీఎం బాధ్యలకు వెళ్లిపోయారు.

## జనావాసాల్లోకి రెండు నాగు పాములు



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జనావాసాల్లో వచ్చిన రెండు నాగు పాములను ప్రాణదార స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ మంగళవారం అడవిలో విడిచి పెట్టారు. ఇంటి పరిసరాల్లో ఇళ్లలోకి వచ్చిన పాములను గుర్తించి రెస్క్యూకు స్థానికులు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వెళ్లి ఆ రెండు విష సర్పాలను పట్టుకొని సురక్షితంగా అడవి ప్రాంతములో ఒదిలేశారు. సంతోష్ మాట్లాడుతూ వన్య ప్రాణులను కాపాడటం, పర్యావరణ సమతుల్యంలో భాగమేనని అన్నారు. భయపడకుండా గమనిస్తూ తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## విదేశాలకు వెళ్లే మైనార్టీ విద్యార్థులకు ఉచిత కోచింగ్

ఖమ్మంటౌన్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు వెళ్లి చదువుకోవాలనుకునే ముస్లిం, క్రైస్తవ , సిక్కు, జైన్, పార్శీ, బౌద్ధులు తదితర మైనార్టీ విద్యార్థుల కోసం తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ , హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ, మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆసక్తి, అర్హతగల మైనార్టీ అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 30వ తేదీలోపు తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, మూడవ అంతస్తు జామియా నిజామియా భవనసముదాయం, గన్‌ఫౌండ్రీ ఆబిడ్స్ హైదరాబాద్‌నందు సమర్పించాలని కోరారు.

## ఘనంగా న్యాయవాదుల దినోత్సవం

ఖమ్మం లీగల్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లాయర్ డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రూపొందించిన రాజ్యాంగ సభలో ఉన్న సభ్యులలో చాలామంది ప్రముఖ న్యాయవాదులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ (రాజ్యాంగ సభ చైర్మన్), అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, బీఎస్‌రావు వంటి న్యాయవాదులు రాజ్యాంగ రచనలో కీలకంగా పనిచేశారు. వారు రాజ్యాంగంలో వ్యక్తిగత స్వేచ్ఛ, న్యాయసమానత్వం, మౌలిక హక్కులు వంటి అంశాలను చేర్చారని కొనియాడురు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, చింతనిప్పు వెంకట్, మందడపు శ్రీనివాసరావు, ఓరుగంటి శేషగిరిరావు, వై.శ్రీనివాసరావు, సీనియర్, జూనియర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనతోనే అభివృద్ధి, సంక్షేమం

**» ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య » అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం

కామేపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనతోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని, ప్రజాపాలన వారోత్సవాల్లో ప్రజలు మమేకం కావాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం జాస్తిపల్లి, పొన్నెకల్ గ్రామాల్లో రూ. 1.62కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాలన ఏడాది గడిచిన శుభ సందర్భంగా ప్రభుత్వం ప్రజా పాలన వారోత్సవాలు డిసెంబరు 1 నుంచి 9వరకు రాష్ట్ర వ్యాప్తంగా విజయోత్సవాలు పండుగ వాతవరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండ కులగణనతో దేశంలోనే ఆదర్శంగా నిలిచామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మేకల మల్లిబాబు, గింజల నర్సింహరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, జగన్నాథరెడ్డి, ధనియాకుల హన్మంతరావు, డీఎస్, రాంబాబు, తోటకూరి శివయ్య, అశోక్, గబ్రూ, బావ్‌సింగ్, రాయల భాస్కర్, దేవండ్ల రామక్రిష్ణ, సరిరాం, ప్రేమ్, గాడేపల్లి నర్సయ్య, కోలా వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అందని కాంటా చార్జీలు

**ఏళ్ల తరబడి మంజూరు కాని వైనం**

**అయిదారేళ్లుగా రైతుల ఎదురుచూపు**



కాంటా వేసిన ధాన్యం బస్తాలు

సత్తుపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన వరి ధాన్యానికి సంబంధించి హమాలీ కూలీ డబ్బులు రైతులకు విడుదల కావటం లేదు. ఏడేళ్లుగా డబ్బులు చెల్లిస్తామని అధికారులు చెప్పటమే తప్ప డబ్బులు జమ చేసిన దాఖలాలు లేవు. దీంతో రైతులు హమాలీ చార్జీలు వస్తాయనే ఆశలు కూడా వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

**ఇదీ పరిస్థితి...**

సాధారణంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు తేమ శాతం ఉండే విధంగా వడ్డను ఆరబెట్టి తాలు లేకుండా చేసి విక్రయించాల్సి ఉంది. ఈ క్రమంలో హమాలీలు ధాన్యం కాంటా వేసి లారీల్లో లోడు చేస్తారు. ధాన్యం కాంటా వేసి లోడు చేసినందుకు గాను క్వింటాకు రూ.50 చొప్పున రైతులు హమాలీలకు చెల్లించాల్సి ఉంది. ధాన్యం కాంటా వేసి లారీల్లో లోడు చేసిన రోజునే హమాలీ చార్జీలు రైతులు చెల్లిస్తూ వస్తున్నారు. ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కాంటా వేస్తే వాటికి సంబంధించిన డబ్బు రైతులు తమ వంతు డబ్బులు చెల్లిస్తున్నారు. రైతులు హమాలీలకు చెల్లించిన డబ్బులను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ప్రతి ఏటా రైతులకు హమాలీ చార్జీలు రైతుల ఖాతాల్లో వేస్తామంటూ అధికారులు చెప్పటమే తప్ప ఏళ్ల తరబడి హమాలీ చార్జీలు రైతుల ఖతాల్లో జమ కవాటం లేదని పలువురు రైతులు చెపుతున్నారు. 2014లోనూ ఆ తరువాత మరొకసారి మాత్రమే ఐకేపీ కేంద్రాల్లో విక్రయించిన రైతులకు సంబంధించిన ఖాతాల్లో మాత్రమే హమాలీ చార్జిలు జమ అయ్యాయని, ఆ తరువాత జమ కాలేదని రైతులు వాపోతున్నారు. ఒక్కొక్క సొసైటీ పరిధిలో రైతుల ఖాతాల్లో జమ కావాల్సిన హమాలీ చార్జి డబ్బులు ఏడేళ్ల కాలంలో రూ.లక్షల్లో ఉన్నాయని చెపుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో వానాకాలం దిగుబడులు కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయిస్తున్నారు. ఈ ప్రభుత్వమైనా గత బకాయిలతో పాటు ప్రస్తుతం హమాలీ చార్జిలు తమకు చెల్లించాలని రైతులకు కోరుతున్నారు.






## కార్తీకమాస పూజలో కార్పొరేటర్ రఫీదాబేగం



ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు26(ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా మంగళవారం 57వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ రఫీదాబేగం మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి అంజనేయ స్వామిఆలయంలో పూజలో పాల్గొన్నారు. భక్తుల అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి పనిచేస్తున్నామని తెలిపారు.

### రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

| | |
|---|---|
| టమాటా | 54 రూ. |
| వంకాయ | 38 |
| గుత్తి వంకాయ | 50 |
| బీరకాయ | 48 |
| పచ్చిమిర్చి | 24 |
| కాకరకాయ | 38 |
| బెండకాయ | 28 |
| పొట్లకాయ | 34 |
| దోసకాయ | 34-58 |
| చిక్కుడు | 68 |
| నాటుచిక్కుడు | 100 |
| గోరుచిక్కుడు | 38 |
| క్యాబేజీ | 34 |
| దొండ | 40-48 |
| సొరకాయ | 20 |
| క్యారెట్ | 74 |
| క్యాప్సికం | 54 |
| ఆలుగడ్డ | 38 |
| ఉల్లిగడ్డ | 60-70 |
| కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు) | 180 |
| కొత్తిమీర కట్ట | 40 |

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

### సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

| | |
|---|---|
| వినోద: | లక్కీభాస్కర్ |
| శ్రీనివాస: | అమరన్ |
| సాయిరాం: | మెకానిక్‌రాకీ |
| కేపీఎస్: | కంగువ |
| తిరుమల: | దేవకీనందన వాసుదేవ |
| సినీ గెలాక్సీ: | జీబ్రా |

# ఇరుకు రోడ్లు... ట్రాఫిక్ సమస్యలు

- కల్వర్టులే ప్రధాన సమస్యలు
- అడ్రెస్ లేని ఖాళీ ప్లాట్ల యజమానులు
- నగరంలోనే అతి పెద్ద వ్యాపార కూడలి
- అభివృద్ధిలో వెనుకబడిన 43వ డివిజన్




డివిజన్‌లోనే ప్రధాన అంబేత్కర్ విగ్రహ కూడలి , ఇరుకుగా సంకల్ప సీ-స్టార్ హాస్పిటల్ రోడ్డు

ఖమ్మంమార్కెట్,నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో 43వ డివిజన్ అత్యంత ప్రాచుర్యం పొందింది. ఈడివిజన్‌లో జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రి, 100కి పైగా పేరుమోసిన ప్రైవేటు దవాఖానాలు, పెద్ద పెద్ద భవంతులు,కమర్షియల్ కాంప్లెక్సులు ఉన్నాయి. ప్రభుత్వానికి పన్నులరూపంలో అత్యంత రాబడి ఉంది. నగరంలోనే ప్రధానమైన వైరా రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ డివిజన్ వ్యాపార పరంగా అభివృద్ధిలో ఉన్నా, నివాసాల మధ్య ఇరుకైన రోడ్లు, సరైన ఎత్తులేని కల్వర్టుల సమస్యలు వేధిస్తున్నాయి. ఎక్కువగా హాస్పిటల్స్‌తో పాటు విద్యాసంస్థలు ఉన్న ఈ ప్రాంతంలో అంతర్గత రోడ్లు విశాలంగా ఉండాలని స్థానికులు పేర్కొంటున్నారు.డివిజన్‌లోని ముఖ్యంగా ఎంపీ రఘురాంరెడ్డి క్యాంప్ ఆఫీస్ గల్లీరోడ్లతో పాటు నేహ్రూనగర్ జేఆర్ ప్రసాద్ హాస్పిటల్, నర్సింహస్వామి గుట్ట క్రింది ప్రాంతం, బాలాజీ నగర్‌లోని పాతరిజిస్ట్రేషన్ ఆఫీస్ఎదుదు రోడ్లు ఇప్పటికీ మట్టి రోడ్లుగానే ఉండటం విశేషం.

**డివిజన్ వివరాలు**

**వైశాల్యం:** 4 కిలోమీటర్లు

**ప్రధాన ప్రాంతాలు:** నెహ్రూనగర్, బాలాజీనగర్, మేకలబండపార్క్-1, మేకల బండపార్క్-2 అంబేద్కర్‌కాలనీ, నర్సింహ స్వామిగుట్ట, తమిళ్‌సెంటర్, ధర్నాచౌక్, జెడ్పీ సెంటర్, ధర్నాచౌక్)

**జనాభా:** 7,000 మంది, ఓటర్లు సుమారు 5,200 మంది

**కార్పొరేటర్:** క్లైమెట్ (98484 12449)

### అడ్రెస్ లేని ఖాళీ ప్లాట్ల యజమానులు

డివిజన్‌లో ఖాళీ ప్లాట్లతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు చిక్కొచ్చింది. ఆయా ఖాళా ప్లాట్లలో చెత్త, పిచ్చి మొక్కలు పెరిగి దోమలు, దుర్వాసనతో స్థానికులు అనారోగ్యాలకు గురవుతున్నారు. చెత్త తొలగించాలని ఖాళీప్లాట్ల యజమానులకు నోటీసులిచ్చినా ఎవరూ స్పందించడంలేదని అధికారులు చెబుతున్నారు. సదరు ఖాళీ ప్లాట్ల యజమానులు విదేశాలలో ఉండటంతో ఎవరూ పట్టించుకోవడం లేదని వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని స్థానికులు పేర్కొంటున్నారు. ప్లాట్లను కొనుగోలు చేసి ఇక్కడ గాలికి వదిలేసి పోతున్నారని చెబుతున్నారు.

### రోడ్లు, కల్వర్టుల అత్యంత ఆవశ్యకం

నగరంలో భారీ వర్షాలు వచ్చినపుడు ఎక్కువగా ఇబ్బందిపడే ఇక్కడి ప్రాంత వాసులకు ముఖ్యంగా ఎత్తైన కల్వర్టులు, అంతర్గత రోడ్లు అత్యంత ఆవశ్యకమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కార్పొరేషన్ నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.1.5 కోట్లతో సీసీ రోడ్లు, సుమారు 13కల్వర్టుల నిర్మాణం తదితర పనులు పూర్తయ్యాయి. ఇంకా మరో రూ.1.5కోట్ల నిధులు అవసరమని స్థానిక ప్రజా ప్రతినిధులు పేర్కొంటున్నారు. సువిశాల డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని స్థానికులు పేర్కొంటున్నారు.

### డివిజన్ అభివృద్ధికి కృషి: క్లైమెంట్, కార్పొరేటర్



ఇరుకు రోడ్లు, కల్వర్టుల సమస్యలతో సతమతమవుతున్న ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నా. ఖాళీ ప్లాట్ల యజమానులు ప్లాట్లలో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి సహకరించాలి. ఎక్కువ విస్తీర్ణం, ఎక్కువ పన్నుల రాబడి వచ్చే ఈ డివిజన్‌కు ఎక్కువ నిధులు కేటాయించాలి. డివిజన్‌లోని సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

### కల్వర్టులు మెరుగు పరచాలి: శ్రీనివాసరావు నెహ్రూనగర్



నగరానికి నడిబొడ్డులో ఉన్న మాప్రాంతానికి కల్వర్టుల వ్యవస్థ సరిగ్గా లేదు. ఈ డివిజన్‌లో ముఖ్యంగా మూడు ప్రధాన మార్గాల్లో 3 కల్వర్టులు నిర్మాణం అత్యంత ఆవశ్యకత ఉంది. అభివృద్ధి విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఎంతో సహకరిస్తున్నారు. డివిజన్ అభివృద్ధి విషయమై ఏ సమస్య వచ్చినా అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలి.

### రోడ్లను వెడల్పు చేయాలి: రాజా, మేకలబండనగర్



డివిజన్‌లోని ముఖ్యమైన ప్రాంతాలలో రోడ్లను వెడల్పు చేయాలి. అన్ని అంతర్గత రోడ్లు సక్రమంగా లేవు. కొన్ని రోడ్లు ఇప్పటికీ మట్టి రోడ్లుగానే దర్శనమిస్తున్నాయి. ఈప్రాంతానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తే ఇంకా అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి మోడల్ డివిజన్‌గా రూపొందించాలి.

## పత్తి రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



పత్తిని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మంరూరల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని గుర్రాలపాడు, తల్లంపాడు, పోన్నేకల్లులోని జిన్నింగ్ మిల్లులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. తేమ పరీక్షలను తనిఖీ చేశారు. రైతులు జిన్నింగ్ మిల్ వద్ద ఎదురుచూసే అవకాశం రానివ్వకుండా ఉదయం పూట వచ్చిన నాణ్యమైన పత్తిని ఆ రోజే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పత్తి, ధర చెల్లింపుల నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీం, సీసీఐ ప్రతినిధి అవినాష్, మార్కెట్ కార్యదర్శులు ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ

రఘునాథపాలెం,నవంబరు26(ఆంధ్రజ్యోతి): మాలలహక్కుల పరిరక్షణపై డిసెంబరు1న నిర్వహించనున్న చలో హైదరాబాద్ సింహగర్జన పోస్టర్‌ను మంగళవారం రఘునాథపాలెంలో మండల అధ్యక్షుడు అంతోటి బుచ్చయ్య ఇతర నాయకులు ఆవిష్కరించారు. నాయకులు ఇర్లల లలితరాజ్, రెంటాల ప్రసాద్, కొర్లపాటి రామారావు, రెంటాల దానయ్య, కందుల వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి మణిరత్నం, రాము, గోపి, సంజీవరావు, పుల్లయ్య, కిరణ్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి

తిరుమలాయపాలెం, నవంబరు26 (ఆంధ్రజ్యోతి):గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సుబ్లేడులో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

## పోలీసుల దమనకాండ సరికాదు: నల్లమల

ఖమ్మంక్రైం,నవంబరు26(ఆంధ్రజ్యోతి): 9నెలలుగా నిరవధిక దర్నా చేస్తున్న రైతుల శిబిరంపై హర్యాన పోలీసులు మూకుమ్మడి దాడిచేసి, రైతు నాయకుల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని కిసాన్ మోర్చా(నాన్‌పొలిటికల్)జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు ఖండించారు. కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్‌ను నాటకీయంగా కిడ్నాప్ చేసి లూథియానా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్బందించారన్నారు. ఆమరణ దీక్షకు మద్దతు తెలిపేందుకు దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన తనతోపాటు శాంతాకుమార్(కర్ణాటక),పాండ్యన్(తమిళనాడు), సుధ(పాండిచేరి) తదితరులను నిర్బందించి డిల్లీ తీసుకువెళ్లి విడిచిపెట్టారని తెలిపారు.

## శాఖాహారంపై ర్యాలీ

కామేపల్లి, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాళ్లగూడెంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మహాకరుణ ప్రచార యాత్రను మంగళవారం సీపీఐ జిల్లా నాయకులు పుచ్చకాయల క్రిష్ణయాదవ్ ప్రారంభించారు. యోగాపై అవగాహన కల్పించారు.

## గిరిజన కుటుంబానికి ప్రభుత్వం అండ

- వైద్యానికి రూ.1.5 లక్షల ఎల్‌వోసీ మంజూరు



ఎల్‌వోసీ లేఖను బాధిత కుటుంబానికి అందిస్తున్న తుమ్మల యుగంధర్

రఘునాథపాలెం,నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యానికి గురైన గిరిజన వ్యక్తికి ప్రభుత్వ ఆర్థిక అండ దొరికింది. రఘునాథపాలెం మండలం పరికాలబోడుకు చెందిన భూక్యా లోహిత అనారోగ్యానికి గురి కావటంతో ప్రభుత్వం రూ.1.5లక్షల ఎల్‌వోసీ మంజూరు చేసింది. మంజూరు లేఖను జిల్లా కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ అందించారు.

### సీఎం రీలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని తల్లంపాడు గ్రామానికి చెందిన రేగళ్ల రమ్యకు మంజూరైన సీఎం రీలీఫ్‌ఫండ్ చెక్కును సీపీఎం సీనియర్ నాయకులు బత్తినేని వెంకటేశ్వరరావు లబ్దిదారులకు మంగళవారం అందజేశారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫార్సుతో సీపీఎం మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి సహకారంతో రమ్యకు మంజూరైన చెక్కును అందించామన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారావు, పల్లె శ్రీను, ఉపేందర్, నరేష్, నాగేశ్వరరావు, రాము, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## 'మమత'లో అరుదైన శస్త్రచికిత్స

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు26(ఆంధ్రజ్యోతి): మమత ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి ఓవ్యక్తి ప్రాణాలు కాపాడినట్లు మమత వైద్య విద్యాసంస్థల సెక్రటరీ పువ్వాడ జయశ్రీ, న్యూరో స్పెషలిస్ట్ జగదీష్ తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో ఈవివరాలు వెల్లడించారు.చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన 80సంవత్సరాల జి.వెంకయ్య కొద్దిసంవత్సరాలుగా తలనొప్పి, కళ్లు తిరగడు, నడుస్తూ తూలి పడిపోవడం సమస్యలతో నవంబరు1న ఆస్పత్రికి వచ్చాడు. వైద్యులు బ్రెయిన్‌లో ట్యూమర్‌ను గుర్తించారు. ఈనెల15న తలవెనుక భాగం కండరాల మధ్య నుంచి క్లిష్టమైన శస్త్రచికిత్స ద్వారా ట్యూమర్‌ను తొలగించారు.అరుదైన శస్త్రచికిత్స ద్వారా రోగికి పైసా ఖర్చులేకుండా విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ జగదీష్ తెలిపారు. వెంకయ్య ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు. ఆపరేషన్ చేసిన వైద్యులను రోగి బంధువులు, పలువురు అభినందించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



దుస్తులు అందచేస్తున్న కలెక్టర్

ఖమ్మంటౌన్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కోరారు. మంగళవారం నగరంలోని గాంధీచౌక్‌లోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో రోటరీక్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో వితరణ చేసిన ఏకరూప దుస్తులను కలెక్టర్ విద్యార్థినులకు అందచేశారు. సమయాన్ని, సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగవచ్చన్నారు. తన భార్య కేరళలోని చిన్న ప్రాంతం నుంచి వచ్చి, అధ్యాపకురాలుగా పనిచేసి, ప్రస్తుతం ఇండియన్ ఫారెన్ సర్వీస్‌లో పనిచేస్తున్నారని, పదిమందికి మంచి చేయాలనే ఆలోచనకు తన భార్య నుంచే స్ఫూర్తి లభించిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి కే.రవిబాబు, రోటరీక్లబ్ పీడీజీ మల్లాది వాసుదేవ్, కాళ్ల ఫౌండేషన్ ఛైర్మన్ కాళ్ల పాపారావు, వేంకటేశ్వరరావు, హరిశ్రీనివాస్, రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ బీ.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## విజయోత్సవాల్లో కానరాని ప్రజాప్రతినిధులు

- అధికారులకే విజయోత్సవాలు
- ప్రచారం లేకుండా నియోజకవర్గ స్థాయిలో ప్రారంభం



ప్రజాపాలన విజయోత్సవాల్లో పాల్గొన్న అధికారులు

రఘునాథపాలెం,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాటు చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు నవంబరు 26 నుంచి ప్రజాపాలన- ప్రజావిజయోత్సవాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఖమ్మం నియోజకవర్గ స్థాయిలో రఘునాథపాలెం మండలం శివాయిగూడెంలో మంగళవారం అధికారికంగా కార్యక్రమం ప్రారంభించారు. శివాయిగూడెంలో మహిళ స్వయం సహాయక సంఘాల పేరుతో మంజూరైన రూ.3లక్షల విలువైన పౌల్ట్రీఫార్మ్‌కు రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారి రామకృష్ణ శంకుస్థాపనలు చేసి ప్రజావిజయోత్సవాల కార్యక్రమం ప్రారంభించారు. అయితే కార్యక్రమానికి మహిళ సంఘాలు, మాజీజడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, ప్రజలు హాజరు కాలేదు. కేవలం అధికారులు,వారి వెంట వచ్చిన సిబ్బంది మాత్రమే హాజరుకావటం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విజయోత్సవాల కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి వీరయ్య, జిల్లా విజిలెన్స్ అధికారి సక్రియా, డీఆర్డీవో సన్యాసయ్య, ఎంపీడీవో అశోక్ కుమార్, ఏపీవో పద్మయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### కేఎంసీ బిల్ కలెక్టర్ల ఫోన్ నెంబర్లు

| బిల్ కలెక్టర్ పేరు | రెవెన్యూ డివిజన్ | ఫోన్ నెంబర్ |
|---|---|---|
| ఎం. శ్రీను | 1 | 94405 45184 |
| యు. ఉపేందర్‌రావు | 2 | 97019 58195 |
| సీహెచ్ వెంకటేశ్వర్లు | 3 | 99484 87342 |
| జోహ్నాగోష్ | 3 | 93910 55901 |
| వీ. వస్రాం | 4 | 97053 53128 |
| వీరబాబు | 5(1,6) | 98488 81129 |
| శ్రీదేవి | 5(7) | 96661 31260 |
| అవినాష్ | 5,7 | 63011 34453 |
| డీ. నాగరాజు | 8 | 98491 86761 |
| కే. ఉప్పలి | 9 | 95538 73186 |
| టీ. ముత్తయ్య | 11(1,7) | 76750 92606 |
| టీ. పల్లవి | 11(8,9) | 99510 53054 |
| ఎస్ వెంకటేశ్వర్లు | 10,11(12) | 98667 41175 |
| ఏ. రమేశ్ | 12 | 95533 55930 |
| డీ. అప్పయ్య | 13,14 | 86888 77412 |
| సీహెచ్ రాములు | 14 | 96523 14210 |
| బీ. సైదులు | 15(1,5) | 98663 04918 |
| డీ మల్లయ్య | 15(6,7,8) | 95429 90630 |
| లింగరాజు | 15(9) | 96664 40310 |
| సురేందర్ | 15(10,15) | 99890 04290 |
| ఏ. శ్రీనివాసరావు | 15(16,17) | 76750 50834 |
| వై. సాయిరామకృష్ణ | 15(18,19) | 70754 20494 |
| మాధవరావు | 15(20,21) | 90109 26224 |
| టీ. రామారావు | 16 | 63014 05221 |
| వీ. వెంకన్న | 17,18,19 | 99085 84502 |
| ఎం. నాగరాజు | 20 | 94943 16361 |

## విద్యార్థులు రాజ్యాంగాన్ని అధ్యయనం చేయాలి

ఖమ్మంటౌన్,నవంబరు26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మహోన్నతమైన రాజ్యాంగాన్ని విధిగా అధ్యయనం చేయాలని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ జకిరుల్లా పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం-నేటితరం అధ్యయన ఆవశ్యకత అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు.అంబేద్కర్ సారధ్యంలో స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం, సోదరభావం కీలకమైన వేదికగా రూపొందించారన్నారు. 75ఏళ్లుగా ప్రపంచంలో రాజ్యాంగం సమున్నతంగా నిలిచిందన్నారు.విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పరిశోధకుడు పునుకు వేలాద్రి, ప్రొఫెసర్‌వై.రవి వర్ధన్, పి.నరసింహారావు, పూర్ణచందర్ వెంకటేష్‌బాబు, అప్పారావు పాల్గొన్నారు.

### గిరిజన ప్రతిభ పాఠశాలలో..

రఘునాథపాలెం: గిరిజన ప్రతిభ పాఠశాలలో మంగళవారం 75వ రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాలస్వామి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ద్వారానే సమాజ పరిరక్షణ ఉందన్నారు. ప్రజలకు స్వేచ్ఛ రాజ్యాంగం ద్వారానే వచ్చిందని వివరించారు. ఉపాధ్యాయులు దాసరి శ్రీనివాసరావు, బోనత్ ఈశ్వర్ పాల్గొన్నారు.

### ఘనంగా రాజ్యాంగ గౌరవ దినోత్సవం

ఖమ్మంబైపాస్‌రోడ్: బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ పుస్తకప్రదర్శన ఏర్పాటుచేసి రాజ్యాంగ ప్రాముఖ్యతను పార్టీనాయకులకు, కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గంటేల విద్యాసాగర్, వక్కలంక సుబ్రహ్మణ్యం, రవికుమార్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, మంద సరస్వతి, చంద్రశేఖర్,వెంకటనారాయణయాదవ్, అనిత, ఉపేంద్రగౌడ్, ఖమ్మం అర్బన్‌టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.





అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గల్లా సత్యనారాయణ, గిరిజన ప్రతిభ పాఠశాలలో

## 'ఎస్‌బీఐటీ'లో ఎంబార్క్ ఫ్రెషర్స్‌డే




మాట్లాడుతున్న కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ

ఖమ్మంటౌన్,నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐటీలో మొదటి సంవత్సరం విద్యార్థులను ఆహ్వానిస్తూ సీఎస్ఈ విద్యార్థులు ఎంబార్క్ పేరుతో మంగళవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకలు సందడిగా సాగాయి. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశఎంతో కీలకమైందన్నారు. విద్యార్థిగా అడుగుపెట్టిన ప్రతీఒక్కరికి ప్లేస్‌మెంట్ వచ్చేలా కృషి చేస్తామన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ. శివప్రసాద్, రవీంద్రబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 'అధికారులపై తప్పుడు ప్రచారం సరికాదు'

కారేపల్లి, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీసీఐ కేంద్రంలో పనిచేస్తున్న అధికారులపై, తనపై కొందరు అక్రమంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.రాంబాబు అన్నారు. మంగళవారం కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ యన మాట్లాడుతూ పత్తి దళారులకు మద్దతుగా పని చేస్తున్నట్లు, దళారులు తీసుకువచ్చిన పత్తి ని ముందుగా విక్రయిస్తున్నట్లు అనేక మంది తప్పుడు ప్రచారం చేస్తునది నిజం కాదని పేర్కొన్నా రు. తప్పుడు ప్రచారం చేసేవారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ గ్రేడ్ వన్ కార్యదర్శి సుచిత్ర, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'వితంతు పింఛన్లు మంజూరు చేయాలి'

వైరా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వితంతు మహిళలు పించన్ కోసం ఆరేళ్లుగా ఎదురుచూస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు ఇవ్వకుండా ఏడాదిపాలన సంబురాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని మాజీ ఎంపీపీ బొంతు సమత, ఐద్వా పట్టణ కార్యదర్శి తోట కృష్ణవేణి విమర్శించారు. వైరాలో మంగళవారం జరిగిన ఐద్వా సమావేశంలో వారు మాట్లాడారు. వితంతు పింఛన్లు రాక అనేకమంది మహిళలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చావా కళావతి, తాటి కృష్ణకుమారి, లక్ష్మి, సుజాత, దుర్గ, ఉష, తిరుమలమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థుల ఆందోళన

ముదిగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యూలక్ష్మీపురం గ్రామంలో బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ముదిగొండ నుంచి న్యూలక్ష్మీపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పి కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా కంకర, డస్ట్ పోసి వదిలేశారని ఆరోపించారు. రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో ఇళ్లలోకి దుమ్ము, ధూళి వచ్చి అనారోగ్యానికి గురవుతున్నామని వాపోయారు. వెంటనే బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

# నిర్మించారు.. వదిలేశారు..

» నిరుపయోగంగా పల్లిపాడు గ్రామ పంచాయతీ భవనం » పట్టించుకోని అధికారులు

కొణిజర్ల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవనాలను రూ.లక్షలతో నిర్మించి.. లక్షణంగా వదిలేశారు. పంచాయతీ భవనాల నిర్మాణం పూర్తైనా కూడా వాటిని వినియోగించడంలో అధికారులు విఫలమవుతున్నారే విమర్శలు వస్తున్నాయి. మంజూరైన భవనాలు ఎంత వరకు పూర్తయ్యాయో కూడా అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారి, శిథిలావస్థలోకి చేరుతున్నాయని చెబుతున్నారు.. మండలాన్ని మునిసిపాలిటీలో కలిపిన తర్వాత అధికారులు కాని, ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.




పల్లిపాడులో నిరుపయోగంగా ఉన్న నూతన పంచాయతీ భవనం

### వినియోగంలోకి తేవాలి..

కొణిజర్ల మండలం వైరా మునిసిపాలిటీ పరిధిలో ఉన్న పల్లిపాడు గ్రామంలో 2017 డిసెంబరు2న ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.13 లక్షలతో మంజూరైన గ్రామ పంచాయతీ భవనానికి అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దాదాపుగా భవన నిర్మాణం పూర్తి అయ్యింది. కొద్దిపాటి పనులు చేయాల్సి ఉంది. భవన నిర్మాణం చేపట్టిన గుత్తేదారుకు కూడా బిల్లులు రాలేదని తెలిసింది. భవన నిర్మాణం పూర్తయ్యే సమయానికి పల్లిపాడు గ్రామం వైరా మునిసిపాలిటిలో కలిపారు. ఇక అంతే ఆ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని గాలికి వదిలేశారు. ఎవరూ ఆ రోజు నుంచి ఆ భవనాన్ని పట్టించుకోలేదు. వెంటనే అధికారులు స్పందించి నూతన భవనాన్ని వినియోగం లోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

### వినియోగంలోకి తేవాలి

● తాటిపల్లి సుధీర్, పల్లిపాడు



గ్రామంలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, ఇతర ప్రభుత్వ భవనాలను అధికారులు పట్టించుకోని వినియోగంలోకి తేవాలి. నిరుపయోగంగా మారడంతో ప్రజాధనం వృథా అవుతుంది. పల్లిపాడు వైరా మునిసిపాలిటీ కిందకు వచ్చిన తర్వాత మంజూరైన ప్రభుత్వ భవనాలను పట్టించుకోలేదు. భవనాలకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందిస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

## పెనుబల్లిలో ఆరోగ్య ఉపకేంద్రం..



పెనుబల్లిలో ప్రారంభానికి నోచుకోని పల్లెదవాఖాన భవనం

పెనుబల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెనుబల్లిలో రూ.20లక్షలతో నిర్మించిన భవనం ఏడాదికాలంగా ప్రారంభానికి నోచుకో లేదు. గత ప్రభుత్వం మండలంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్(పల్లె దవాఖానా) పేరు తో మండలంలోని పెనుబల్లి, వీఎంబంజర్, భవన్నపాలెం, లింగగూడెం, లంకప ల్లి, టేకులపల్లి, తాళ్లపెంట గ్రామాల్లో పల్లె దవాఖాన భవనాలు నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున మంజూరు చేసింది. వీటిలో టేకులపల్లి, లంకపల్లి, భవన్నపాలెం, లింగగూడెం గ్రామాల్లో భవనాలు పూర్తి చేసి వినియోగిస్తుండగా, పెనుబల్లిలో భవనం పూర్తయినప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. వీఎంబంజర్‌లో భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పెనుబల్లిలో పూరైన భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

## సర్వే డేటా ఎంట్రీ పరిశీలన

వైరా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపల్ కార్యాలయంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీని మంగళవారం మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కమిషనర్ చింతా వేణు పరిశీలించారు. సర్వే డేటా ఎంట్రీలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారి వెంట వార్డు అధికారులు, ఎన్యూమరేటర్లు, ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముదిగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ కృష్ణన్ సూచించారు. మంగళవారం ముదిగొండ మండలం పండ్రేగుపల్లి, న్యూలక్ష్మీపురం, ముదిగొండ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పండ్రేగుపల్లి తండాలో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.మూడు లక్షలతో ఏర్పాటు చేయనున్న కోళ్లఫారాన్ని పరిశీలించారు. ముదిగొండ మండలపరిషత్ కార్యాలయంలో ఇంకుడుగుంత నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే న్యూలక్ష్మీపురం లోని నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీధర్ స్వామి, ఏపీవో రంగనాయకమ్మ, సూపరింటెండెంట్ భాస్కర్‌రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



విప్పలమడక పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. మంగళవారం సూర్యతండా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు.. అదే విధంగా శ్రీరాంపురతండాలో మంగళవారం జీలుగు విత్తన సంచులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణనరేంద్రకుమార్, వేముల కృష్ణప్రసాద్, మేడ ధ ర్మా రావు, లచ్చిరాంనాయక్, ఏడీఏ కరుణశ్రీ, ఏవోనరసింహారావు, ఏఈవో బాలకృష్ణ పాల్గొన్నారు.

కారేపల్లి, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పలు అభివృద్ధి కార్యాక్రమాలకు శంకుస్థాపన చేశారు. కాగా ఈ కార్యక్రమానికి హాజరు కాని సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో సురేందర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### కేజీ తరుగు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాం

కొణిజర్ల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చెప్పినట్టుగా కేజీ తరుగు కూడా తీయకుండా రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రం కొణిజర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అదే విధంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పలువురి లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు, దొబ్బల సౌజన్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొబ్బల సౌజన్య, కోసూరి శ్రీను, చెరుకుమల్లి రవి, బానోతు నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

వైరా, నవంబరు26(ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో మంగళవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్.సురేష్‌కుమార్, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, మచ్చా బుజ్జీ, మట్టూరి వెంకటేశ్వరరావు, వడ్డే నారాయణ, చప్పిడి వెంకటేశ్వరరావు, యడ్లపల్లి వీరయ్యచౌదరి, పాలేటి నర్సింహారావు, దాసరి దానియేలు, పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాపయ్య, కొలికొండ వీరభద్రరావు తదితరులున్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం

» ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



మండాలపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మంగళవారం మండలంలోని మండాలపాడులో రూ.54లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి, ఎంపీడీవో అన్నపూర్ణ, ఈజీఎస్ ఏపీవో విజయ్‌బాబు, గిర్దావర్ తదితరులు పాల్గొన్నారు.

### ఏడాది పాలనలో ఎంతో అభివృద్ధి

తల్లాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఏడాది పాలన కాలంలో తెలంగాణలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మంగళవారం మండలంలోని నారయ్యబంజర, పినపాక గ్రామాల్లో రూ.1.50కోట్ల ఈజీఎస్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకా రం చుట్టడం జరుగుతుందన్నారు. మల్సూర్‌తం డా గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగిన అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏ ఎంసీ చైర్మన్ బాగం నీరజ, సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, ఆర్డీవో రాజేంద్రగౌడ్, తహసీల్దార్ ఏ.వనజ, ఎంపీడీవో ఎం.చంద్రమౌళి, ఎంపీవో కొండపల్లి శ్రీదేవి, ఎస్ఐ కొండల్‌రావు, ఏపీవో కోటయ్య, జక్కంపూడి కిషోర్, శరత్‌బాబు, శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

కల్లూరు, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వైబీపల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి ఎమ్మెల్యే రాగమయి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్రగౌడ్, సీడీపీవో నిర్మలజ్యోతి, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజచౌదరి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు తదితరులున్నారు.

## దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

పెనుబల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నేడు దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం అని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం వీఎంబంజర్‌లో సీపీఎం సత్తుపల్లి డివిజన్ 13వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సభలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావులు ప్రసంగించారు. ముందుగా వీఎంబంజర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఎం డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు.

సీపీఎం డివిజన్ కార్యదర్శిగా తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన శీలం సత్యనారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సభలో మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాసరావు, మాదినేని రమేష్, గాయం తిరుపతిరావు, సర్వేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

## వైభవంగా లక్ష దీపోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

తల్లాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం రాత్రి లక్ష దీపోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## దారి వివాదంలో ఘర్షణ..కేసు నమోదు

బోనకల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల గ్రామంలో మంగళవారం దారి వివాదానికి సంబంధించి జరిగిన ఘర్షణలో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుబాబు తెలిపారు. గ్రామానికి చెందిన జొన్నలగడ్డ గోవింద్ ఇంటి వద్ద దారి విషయంలో కొంత కాలంగా వివాదం నడుస్తుంది. ఈ క్రమంలో గార్లపాటి వెంకటేశ్వర్లు, వెంకాయమ్మ, నాగరాజు, కోటేశ్వరరావులు గోవింద్ ఇంటి వద్ద గోడను కూల్చివేయడంతో పాటు ఘర్షణ పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

ఎర్రుపాలెం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రింగ్‌సెంటర్‌లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను మంగళవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈసందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య మాట్లాడుతూ అదానికి ఆస్తులు కట్టబెట్టడం కోసమే ప్రధాని పనిచేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, గామాసు జోగయ్య, సగుర్తి సంజీవరావు షేక్‌లాల, బేతి శ్రీనివాసరావు, నాగుల్‌మీరా, నాగులవంచ వెంకటరామయ్య, బసవయ్య, కరీం, సుబ్బారెడ్డి, సుబాని, పుల్లారావు పాల్గొన్నారు.

## జీరో టిల్లేజ్ సాగు లాభదాయకం

» మధిర ఏడీఏ విజయ్ చంద్ర

చింతకాని, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మాగాణుల్లో జీరో టిల్లేజ్ పద్ధతిన వరి సాగు లాభదాయకమని సహాయ వ్యవసాయ సంచాలకులు మధిర విజయ్ చంద్ర అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లచ్చగూడెం, రామకృష్ణాపురం, రాఘవాపురం గ్రామాల్లో ఆయన జీరో టిల్లేజ్ పద్ధతిన సాగు చేసిన మొక్కజొన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. రైతులు యాసంగిలో వరికు బదులు జీరో టిల్లేజ్ పద్ధతిన మొక్కజొన్న సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. మానస, ఏఈవో ఆయేషా, రాము, రైతులు పాల్గొన్నారు.

## కల్లూరు ఎస్ఐ షాకీర్ ఆకస్మిక బదిలీ

కల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న యస్‌కె షాకీర్‌ను ఆకస్మికంగా బదిలీ చేస్తూ సీపీ కార్యాలయం నుంచి మంగళవారం ఈ మేరకు ఆదేశాలు అందినాయి. గత జనవరి నెలలో ఇక్కడకు ఎస్ఐ జాయిన్ అయిన షాకీర్‌ను, తాజాగా మహబుబాబాద్ జిల్లాకు బదిలీ చేస్తూ పోలీసు ఉన్నత అధికారి కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడినాయి. దీంతో ఇక్కడ నుంచి రిలీవ్ అయిన షాకీర్ స్థానంలో కల్లూరు ఎస్ఐగా ఎవరిని నియమించలేదు. ఉన్నత అధికారులకు ఎస్ఐ షాకీర్ పై పలువురు ఫిర్యాదు చేయడంతో ఆయనపై ఆకస్మికంగా బదిలీ వేటు పడిందని తెలిసింది.

## 'సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి'

కారేపల్లి, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీ, సౌజన్య, వసంత, సమీనా, శ్రీలత, విజయ మమత, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వ నమోదు

బోనకల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ కోరారు. మండలంలోని చిరునోముల, నారాయణపురం గ్రామాల్లో మంగళవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం ద్వారా రూ. 5లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సాధినేని హన్మంతరావు, సూర్యదేవర రమేష్, చావా హన్మంతరావు, కరివేద పిచ్చయ్య, షైనేని రవి కుమార్, గొల్లపల్లి నాగమల్లేశ్వరరావు, నరేష్, మలాది లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ చాలీసా

చింతకాని, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం బహుళపక్ష ఏకాదశి సందర్భంగా మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో మంగళవారం దాసాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం అలరించింది. కోమట్లగూడెం గ్రామానికి చెందిన శ్రీరామహనుమ భక్తబృందం ఆధ్వర్యంలో సుమారు 50 మందితో హనుమాన్ చాలీసా సహస్ర గళార్చన చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇంగువ విద్యాసాగర శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్న ప్రసాదం గావించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## మాస్టీన్ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

వైరా, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా మాస్టీన్ కులసంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని తాటిపూడిలో జరిగిన సమావేశంలో ఖమ్మం జిల్లా మాస్టీన్ కుల సంఘం అధ్యక్షుడిగా నాగేళ్ల ప్రసాద్(ఖమ్మం), ఉపాధ్యక్షుడిగా దర్శనం సతీష్(సత్తుపల్లి), ప్రధాన కార్యదర్శిగా మన్నెం సత్యానందం(వైరా), సహాయ కార్యదర్శిగా మన్నెం శ్రీను(మధిర), కోశాధికారిగా దర్శనం నాగేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ బుద్దుల చిన్నఅచ్చయ్యతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఆసం ఘం జాతీయ అధ్యక్షుడు నాగేళ్ల బాబూరావు, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దర్శనం రాములు, నాగేళ్ల రాజు, నాగేళ్ల ప్రసాద్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జోషి, నాగేళ్ల ముత్తయ్య రమేష్ పాల్గొన్నారు.

## ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుల అరెస్టు

తల్లాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): లగచర్ల తండా సందర్శనకు వెళ్తున్న లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులను మంగళవారం తల్లాడ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మండలంలోని రంగంబంజర, మల్సూర్‌తండాలకు చెందిన లంబాడీ హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు దశరథ్‌నాయక్, మండల అధ్యక్షుడు రవినాయక్‌లను హౌజ్ అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## పేదల పక్షాన పోరాడటమే లక్ష్యం

» సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



సీపీఐ పార్టీ సభ్యత్వాన్ని ఇస్తున్న పోటు ప్రసాద్

బోనకల్, నవంబరు 26(ఆంధ్ర జ్యోతి): పేదల పక్షాన పోరాడటమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సూచించారు. మండలంలోని మోటమర్రి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, మం డల కార్యదర్శి యంగల ఆనందరావు, బుర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



కల్లూరులో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల వ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నారాయణపురం, ఎర్రబోయనపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి, మధిరలో మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, కమిషనర్ సంపత్ కుమార్ రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు పాటు పడుతామని ప్రతిజ్ఞ చేశారు.




టేకులపల్లిలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



కారేపల్లిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



ఎర్రుపాలెంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు